

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## బిల్డింగ్ ప్లాన్ అనుమతులకు త్వరలో నూతన విధానం



**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 6,ప్రభాత వార్త:** రాష్ట్రంలో బిల్డింగ్ ప్లాన్ అనుమతులకు అవసరమైన అన్ని పత్రాలు సమర్పిస్తే కేవలం 24 గంటల్లో పర్మిషన్ ఇచ్చే నూతన విదానాన్ని తీసుకువస్తున్నామని రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.శుక్రవారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యకలాపాల పై కమాండ్ కంట్రోల్ లో మంత్రి నారాయణ,కమిషనర్ సూర్యతేజ కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ వివిధ లే అవుట్ లలో పార్కుల కోసం కేటాయించిన భూమిని ఖచ్చితంగా పార్కులు కోసమే వినియోగించాలన్నారు.నెల్లూరు నగరపాలక సంస్థ ను ప్రతివారం సమీక్షిస్తున్నామని,నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.నగరంలోని పార్కులను సెంట్రల్ లైటింగ్ సిస్టం ను అభివృద్ధి చేస్తామన్నారు.అయితే ప్రజలు కూడా వివిధ రకాల రెవెన్యూ బకాయిలను చెల్లించాలన్నారు.ఇప్పటికే నాలుగు నెలల కాలంలో ఆరున్నర కోట్ల రెవెన్యూ బకాయిలు ప్రజలు చెల్లించారని,వారిని ఆదర్శంగా తీసుకొని మిగితావారు కూడా పెండింగ్లో ఉన్న 120 కోట్ల బకాయిలను చెల్లించాలన్నారు.ప్రజలు చెల్లించిన సొమ్మును తిరిగి ప్రజావసారాలకే వినియోగించాలన్నారు.అప్పుడే నగర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.నెల్లూరు నగరంలో పుట్టి దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరు వాసులు నగరంలోని అభివృద్ధి చేసిన పార్కులను దత్తత తీసుకొని నిర్వహణ చేపట్టాలని నిలుపునిచ్చారు.నగరంలోని పశువుల సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక వాహనం కేటాయిస్తున్నామన్నారు.అలాగే వీధి కుక్కల పునరత్పుత్తికి అవకాశం లేకుండా వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు.ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,నుడా చైర్మన్ కోటం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 6, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో కేంద్రమంత్రిని కలిసి ఆయన్ను శాలువాతో సత్కరించారు. అనంతరం కేంద్రమంత్రితో భేటీ అయి వివిధ అంశాలపై వారితో చర్చించారు.

## నేడే బడి పండుగ

### తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఉత్సుకత
### మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కు పూర్తి సన్నద్ధం
### జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 6, ప్రభతవార్త** ఎటువంటి ఆర్భాటాలు లేకుండా పూర్తిస్థాయి విద్యా వాతావరణంలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలకు జిల్లాలోని పాఠశాలలు సిద్ధమయ్యాయని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు.మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సన్నాహకాలపై జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు, యం పి డి ఓ, యం ఇ ఓ లతో శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం పెంచే విధంగా, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మధ్య సానుకూల అనుబంధం ఏర్పడేందుకు ఉద్దేశించిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం జిల్లాలోని 2604 పాఠశాలల్లో నేడు జరగనుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామని, అందుకగుణంగా ఏర్పడిన వివిధ కమిటీల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాటులు పూర్తి చేశామన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒకే వేదికను పంచుకొని వారి బిడ్డల బంగారు భవిష్యత్తుకు పునాది వేసేందుకు, విద్యార్థుల విద్యా పురోగతి గురించి చర్చించనున్నారని, అదే సమయంలో పాఠశాల అభివృద్ధి గురించి పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు అందరినీ భాగస్వామ్యం చేసి పాఠశాలలకు వసతులు సమకూర్చుకునేందుకు అవసరమైన విధివిధానాలపై చర్చిస్తారన్నారు. ఇక ప్రతి రోజూ పిల్లలకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనంను తల్లిదండ్రులకు కూడా అందిస్తారని ఇందులో వైట్ రైస్, పప్పు లేదా పప్పు చారు, వెజిటబుల్ కర్రీ, స్వీట్ పొంగల్, చిక్కి , రాగిజావ ఖచ్చితంగా ఉంటాయన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించే ఈ సమావేశాలకు కలెక్టరేట్లో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ ను ( నెంబర్ : 0861 2331261 ) ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశాల సందర్భంలో జిల్లాలో ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే కంట్రోల్ రూమ్ ను సంప్రదించవలసిందిగా కోరారు. ఈ సమావేశాలకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే సమావేశంలో పాల్గొంటారని, అలాగే రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ నగరంలోని నవాబ్ పేట బి వి యస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో పాల్గొంటారన్నారు. ఇదేవిధంగా జిల్లాలోని అందరు ప్రజా ప్రతినిధులు వివిధ పాఠశాలల్లో పాల్గొంటారని తెలిపారు.

## లోకేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ దివి శివరాం, మోషే



**కందుకూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** రాష్ట్ర ఐటీ శాఖ, మానవ వనరుల శాఖా మాత్యులు నారా లోకేష్ బాబును ఉండవల్లి లోని క్యాంపు కార్యాలయం నందు కందు కూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కా ర్యదర్శి డాక్టర్ దివి శివరాం దంపతులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ బాబు, శివరాం మధ్య కందుకూరు నియోజకవర్గంలో జరుగుతున్నటువంటి అభివృద్ధి పనులు, పార్టీ బలోపేతంపై ఏ విధంగా ముందుకు వెళ్తున్నారనే దానిపై సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు మోషే మీడియాకు తెలియజేశారు. లోకేష్‌బాబును కలిసిన సందర్భంలో శివరాం వెంట దివి సౌభాగ్యలక్ష్మి, నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే తదితరులు ఉన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**నెల్లూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త -వైద్యం** తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నాడు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఆలయ సంప్రదాయం ప్రకారం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సత్కరించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ శ్రీవారి ఆశీస్సులతో తెలుగు ప్రజలందరికి మంచి జరగాలని, ఏపీ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలని ఆయన ఆకాంక్షించారు.

## తుమ్మల హైమావతమ్మ భూమి సర్వే చేయించి అప్పగిస్తాం
### ఆర్ డీ ఓ అనూష



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 6, ప్రభాతవార్త** మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన తుమ్మల హైమావతమ్మ తన పొలాన్ని సరిహద్దు దారి ఆక్రమించారని సోమవారం నాడు కలెక్టరేట్ లో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విషయంపై జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా నెల్లూరు ఆర్డీవో అనుషాను ఆదేశించారు. హైమావతమ్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలియగానే ఆర్డీవో నెల్లూరు వెంటనే స్పందించి స్థానిక తాసిల్దార్ సర్వేయర్, సబ్ ఇన్స్పెక్టర్‌ను ఆ గ్రామానికి పంపి విచారణ చేయించా మన్నారు. ఇద్దరికీ నచ్చ చెప్పి ఆ 50 సెంట్లు భూమిలోకి ఆక్రమణదారుగాని, ఫిర్యాదు దారు గాని వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ భూమి కాల్వ పోరంబోకు కు సంబంధించిన భూమిగా ఉండని అని భారీ వర్షాల వల్ల ఆ ప్రాంతంలో నీరు ఎక్కువగా ఉండటం వల్ల సర్వే చేయడానికి వీలు కలగడం లేదని ,నీరు తగ్గిన వెంటనే సర్వే చేసి సరిహద్దులు చూపించి భూమిని ఫిర్యాదుదారుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆ 50 సెంట్లు భూమిలోనికి ఎవరు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు లేవని ,అంతా ప్రశాంతంగా ఉందని ఆర్డీవో అనుషా తెలిపారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం,డిసెంబర్6ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 11,900 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 73.08టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 150, ఎన్ఎఫ్‌సికి 500, పెన్నా డెల్టాకు 50, కండలేరు వరద కాలువకు2000 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.909మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## పరిశ్రమలు, పోర్టును కబ్జా చేసిన వైసీపీ



**నెల్లూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త-వైద్యం** పరిశ్రమల దగ్గర నుంచి పోర్టు దాకా అన్నింటిని వైసీపీ నేతలు కబ్జా చేశారని రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ధ్వజమెత్తారు. నగరంలోని ఎన్టీఆర్ నగర్లో జరిగిని రెవెన్యూ సదస్సులో కలెక్టర్ ఆనంద్, ఆర్డీఓ అనూషలతో కలిసి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించి వారికి త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తూ వైసీపీ నేతలు వేల ఎకరాల భూములను కబ్జా చేశారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల దగ్గర నుండి పట్టణ ప్రాంతాల దాకా ..కోట్ల విలువ చేసే భూములను వారు హస్తగతం చేసుకున్నారని మండిపడ్డారు. రెవెన్యూ శాఖలో ఉండే లోపాలను సరిదిద్ది, నిజమైన అర్హుడుకే న్యాయం చేసేలా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజల ఆస్తిని కాపాడేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసినా ప్రైవేటు ఆస్తులను లాకున్నా వారిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి పది నుంచి 14 ఏళ్ల జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను నెల రోజుల్లోనే అధికారులు పరిష్కరిస్తారన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించే విధంగా చట్టాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రికి ప్రజల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మంత్రి నారాయణ స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

## పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 6, ప్రభాతవార్త** జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టర్ ఛాంబర్ లో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక, దేవాదాయ, అటవీశాఖ పరిధిలోని దర్శనీయ ప్రదేశాల పూర్తి సమాచారాన్ని ఆన్లైన్లో వికీపీడియాలో అప్లోడ్ చేయాలని సూచించారు. నెల్లూరు జిల్లాలో టూరిజం అడ్వెంచర్ స్పోర్ట్స్, రోప్ వే ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మన జిల్లాలో ప్రాముఖ్యమైన , బారాషహీద్ దర్గా, సైన్స్ మ్యూజియం, చిల్డ్రన్స్ పార్క్, నగరవనం వంటి చారిత్రాత్మక, పర్యాటక ప్రదేశాలను విద్యార్థులందరూ సందర్శించేందుకు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ ప్రదేశాల్లో ఏవైనా పనులు పెండింగ్లో ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలకు పర్యాటక రంగం గొప్పతనం తెలిసేలా జిల్లాలోని చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాల ప్రాధాన్యత తెలిసేలా డాక్యుమెంట్లను తయారుచేసి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చెప్పారు. సోమశిల ఫారెస్ట్ భూములలో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఉదయగిరి దుర్గం వద్ద రోడ్ల అభివృద్ధికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఆర్కియాలజీ శాఖ పరిధిలో జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. పెంచలకోన, బారాషహీద్ దర్గా, పల్లిపాడు ప్రాంతాల అభివృద్ధికి డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ లు తయారు చేయాలని ఆదేశించారు. నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు నరసింహ కొండ ,జొన్నవాడ రోప్ వే,అడ్వెంచర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు భూములను గుర్తించాలని చెప్పారు. టూరిజం, ఎండోమెంట్, ఫారెస్ట్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్,డీఎం టూరిజం శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా, డిపిఓ శ్రీధర్ రెడ్డి , డిఈఓ బాలాజీ రావు,సోమశిల ఎస్ఈ వెంకట రమణా రెడ్డి,ఎండోమెంట్స్, ఇరిగేషన్,టూరిజం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్రమల లేఅవుట్‌లపై కఠిన చర్యలు తప్పవు



**నెల్లూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త-వైద్యం** అక్రమ లేఅవుట్‌లపై ఎల్ఆర్ఎస్, డీఆర్ఎస్‌లపై దృష్టి సారిస్తున్నామని కడిగింజలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని మంత్రి నారాయణ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాయపాలెం దగ్గర ఒక లేఅవుట్‌లో అపార్టుమెంట్ నిర్మాణాన్ని అనుమతులు మంజూరు కాలేదన్నారు. రోజుకి ఆరు నుంచి ఏడు అప్రూవల్స్ కోసం వస్తున్నాయని, డిఫెసెన్సీ ఉన్న లేఅవుట్‌లు ఈ రోజు స్వయంగా వెళ్లి చూడటం జరిగిందని ఆయన తెలిపారు. అప్రోచ్ రోడ్డు లేకుండా పర్సనల్‌గా ఇళ్ల కట్టుకోవడం కుదరదని ఆయన హెచ్చరించారు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ పై చాలా మట్టుకు సవరణలు చేశామని తెలిపారు. లేఅవుట్ రోడ్డు ప్లానింగ్‌లకు ముప్పై అడుగులకు మార్పులు చేశామని చెప్పారు. అనాధరైజ్డ్ భవంతులను సైతం అన్ని కొట్టి వేయడం జరుగుతుందని హెచ్చరించారు. శాటిలైట్ పిక్చర్స్ ద్వారా చూసి నిబంధనలకు విరుద్దంగా ఉన్న వాటిని డిమాలిష్ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఖచ్చితంగా నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేసుకోవాలని మంత్రి సూచించారు. మేం ఫిజికల్‌గా వెళ్లి అన్ని నిర్మాణాలు చూడటం జరిగిందన్నారు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ లిబరైజేషన్ చేయడం జరిగిందన్నారు. అప్రూవల్ చేసిన ఇరవై నాలుగు గంటల్లో అనుమతి వస్తుందని చెప్పారు. 2024 జూన్ ముందు వరకు నిబంధనలకు విరుద్దంగా ఉన్న ప్రతిది కొట్టేయడం జరుగుతుందన్నారు. ఇరిగేషన్ కెనాల్స్ మీద చర్యలు తీసుకోవాలంటే, ఆర్అండ్‌బి కంబైండ్ డిస్కషన్ చేశామని తెలియజేశారు. ఈ సమావేశంలో ర్టాష్ట ఆక్వా కల్చర్ డవలప్‌మెంట్ అథారిటీ డైరక్టర్ ఆనం వెంకటరమణారెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## 127 ఎకరాల ప్రభుత్వభూమి కబ్జాపై యాక్షన్ ఆగింది ముడుపులకోసమేనా

### కావలి నియోజకవర్గంలో అభివృద్ధి గోరంత.. ప్రచారం కొండంత..!!
### కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ధ్వజం...!!!



**కావలి, డిసెంబర్ 6 ప్రభాతవార్త** కావలి మున్సిపాలిటీ పరిధిలో 127 ఎకరాలు ప్రభుత్వభూమి కబ్జాకు గురైందని వైసిపిమీద అభాండాలువేసిన టిడిపి నేతలు, అధికారులు చేపట్టిన యాక్షన్ ఎందుకు ఆగింది, ముడుపులకోసమేనా.. అంటూ వైసిపి కావలి నియోజకవర్గ ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి టిడిపి పాలనపై ధ్వజమెత్తారు. శుక్రవారం కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కావలి తెలుగుదేశం పాలనపై రెచ్చిపోతూ మాట్లాడారు. ప్రభుత్వభూమి కబ్జాకు గురైందని కాలువలు, గుంటలు, చెరువులు ఆక్రమించారని తమపై లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. ఈ భూమిని స్వాధీనం చేసుకుంటున్నామని చెబుతూ చేపట్టిన యాక్షన్ ఆగిపోయిందని ఇది ముడుపులకోసమేనా.. అంటూ ప్రతాప్‌రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. కబ్జాకు గురైన 127 ఎకరాలు సర్వేనెంబర్లతో వివరాలు ఇవ్వాలని అడిగితే అధికారులు ఒకరిమీద ఒకరు చెప్పుకుంటున్నారన్నారు. సమాచార హక్కుద్వారా సమాచారం అడిగితే ఇప్పటివరకు అధికారులు ఇవ్వలేదన్నారు. ఒకవేళ కబ్జాజరిగితే దానిని బయటకుతీసి ప్రభుత్వభూమిఅని బోర్డులుపెట్టి స్వాధీనం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి డిమాండ్‌చేశారు. కావలి తెలుగుదేశం పాలకుడు అభివృద్ధి చేసేది గోరంత... ప్రచారం మాత్రం కొండంత... అంటూ ప్రతాప్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

**టిడిపి అంటే టెంపర్వరి డెవలప్‌మెంట్ పార్టీ...** టిడిపి అంటే టెంపర్వరి డెవలప్‌మెంట్ పార్టీ అని కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఏది శాస్వతంగా పనులు జరగడంలేదని ఎద్దేవా చేశారు. కావలి తుమ్మలపెంటరోడ్డు నిర్మాణం అవగాహనలేకుండా చేపడుతున్నారన్నారు. తుమ్మలపెంటరోడ్డుకు ఇరువైపులా డ్రైన్లు లేకుండా నిర్మాణం చేపట్టడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డుపై రెండడుగులమేర నీరు ప్రవహిస్తుందన్నారు. రానున్నరోజుల్లో రోడ్డుమీదకు నీళ్లువచ్చి వేసినరోడ్డు పూర్తిగా దెబ్బతింటుందన్నారు. రోడ్డుకు ఉత్తరదక్షిణ కాలువలు నిర్మించి రోడ్డువేయాలన్న అవగాహన టిడిపి నేతలకు లేదా అని ఆయన ప్రశ్నించారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కావలి పట్టణ ట్రంకురోడ్డు ఆధునీకరణకోసం 55కోట్లరూపాయలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. తుమ్మలపెంటరోడ్డుకు 14.8కోట్లు మంజూరు చేయించామన్నారు. అయితే, ప్రస్తుతం చేపడుతున్న తుమ్మలపెంటరోడ్డు ఎక్కువ కాలం ఉండదన్నారు. అదేవిధంగా బృందావనం కాలనీనుండి ముసునూరు బైపాస్‌వరకు రెండువైపులా పదడుగుల ఫుట్‌పాత్, డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేయడం జగనన్న పాలనలో తాము మంజూరు చేయించామన్నారు. ముసునూరు నుంచి బృందావనం కాలనీవరకు డ్రైనేజి పనులు, కరెంటు స్తంభాలు షిఫ్టింగ్‌వర్క్ పనులు పూర్తిచేయడం జరిగిందన్నారు. ఈ టిడిపి పాలనలో మద్దూరుపాడువద్ద చేస్తున్న పనులు చూస్తుంటే ఎంతో ఆశ్చర్యంవేస్తుందన్నారు. డ్రైన్లు, రోడ్డువెడల్పు తగ్గించి నిర్మాణం చేస్తున్నారన్నారు. దీనివల్ల భవిష్యత్తులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు.

**అభివృద్ధి అంతా వైసిపి పాలనలోనే...**జగనన్న ముఖ్యమంత్రి పాలనలో తాను శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుండి రామాయపట్నం పోర్టువరకు, తుమ్మలపెంట రోడ్డునుంచి ఏనుగులబావి రోడ్డును మంజూరు చేయించి పూర్తిచేశామని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల్లో అనేకరోడ్డు వేశామన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ 350 కోట్లతో పూర్తిచేసి మత్స్యకారులకొరకు అంకితం చేశామన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌నందు ప్రస్తుతం 10 కోట్లుకూడా ఖర్చుకాని బ్రిడ్జికోసం హడావిడిగా 22 కోట్లతో కాంట్రాక్టర్ లబ్ధికోసం ఎస్టిమేట్స్ చేయించి పూర్తిగా ఫిషింగ్‌హార్బర్ పనులు తామే చేయించామనే విధంగా తెలుగుదేశంపార్టీ డబ్బా కొట్టుకుంటుందని ఆయన దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో జెమిలి ఎన్నికలుకాని, 2029 లో జరిగే సాధారణ ఎన్నికల్లోకాని మళ్లి జగనన్నను సిఎం చేసుకోవాలన్నారు. ఎవరు భయపడాల్సిన పనిలేదని ప్రజలకు, నాయకులకు అండగా ఉంటామన్నారు.

**అబద్ధాలుచెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు...** చంద్రబాబునాయుడు అబద్ధాలుచెప్పి అధికారంలోకి వచ్చారని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దుయ్యబట్టారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు కాకముందే చంద్రబాబునాయుడు మోసాలు, అబద్ధాలు, అరాచకపాలనను ప్రజలు పూర్తిగా తెలుసుకున్నారన్నారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నారన్నారు. ఇప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డికి 40 శాతం మంది ప్రజల మద్దతు ఉందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కావలి ప్రజలు మేధావులని ప్రతిఒక్కటీ గమనిస్తున్నారని రానున్నరోజుల్లో తెలుగుదేశంపాలనకు బుద్ధి చెబుతారని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత చర్యలు సకాలంలో చేపట్టాలి



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 6, ప్రభాతవార్త** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైన రోడ్డు భద్రత చర్యలు సకాలంలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డిటిసి చందర్ వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తమ శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలను అన్ని కళాశాలలు, హైస్కూల్ లలో చేపడుతున్నట్లు చందర్ చెప్పారు. గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకున్న పలు నిర్ణయాలను అమలు చేయగా, మరికొన్ని పెండింగ్‌లో వున్నట్లు డిటిసి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలు చేసిన తరువాత యాక్షన్ టెకన్ రిపోర్టుతో మీటింగ్‌కు హాజరుకావాలని సంబంధిత అధికారులకు సూచించారు. నెల్లూరు నగరంలో సిగ్నల్ పాయింట్లను త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గొలగమూడి జంక్షన్ వద్ద లైటింగ్ మరింత పెంచాలని సూచించారు. జాతీయ రహదారిపై పశువులు సంచరించకుండా చూడాలని, పశువులకు రేడియం స్టిక్కర్లను అతికించాలని డిపిఓ కు సూచించారు. జాతీయరహదారిపై ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు చేపట్టాలని, హైవే ఎంట్రన్స్, ఎగ్జిట్స్ పాయింట్ల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టి వాహనదారులు హెల్మెట్లు ధరించేలా చూడాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఎంపిక చేసిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను త్వరగా ఏర్పాటుచేసి పోలీసు, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈడార్ ఆన్‌లైన్ సిస్టంలో అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా డేటా ఎంట్రీ పూర్తిచేయాలని, అన్ని హాస్పిటల్స్‌లో ఇందులో నమోదయ్యేలా చూడాలని సూచించారు. ఈ డేటా ఆధారంగా ఏ ప్రదేశంలో ఎక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయో తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలకు రెడ్ క్రాస్ సహకారంతో బ్రీత్ అనలైజర్ మిషన్లను అందించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. నెల్లూరు, పొదలకూరు రోడ్డులో డివైడర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేయాలని సూచించారు. ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను కాపాడిన వారికి గుడ్ సమ్మరిటన్ అవార్డులు అందించాలని, జనవరి 26 వేడుకల్లో వారిని సత్కరించేలా ప్రతిపాదించాలని సూచించారు. నగరంలో ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేసేందుకు పార్కింగ్ ప్రదేశాలను త్వరగా ఎంపిక చేయాలని సూచించారు.

## పెద్దపుత్తేడు సచివాలయంలో రెవెన్యూ సదస్సు



**దగదర్తి డిసెంబర్ 6, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతమైన పెద్దపుత్తేయుడు గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగి)ంది ఈ సదస్సు ముఖ్య కారణం నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మారునకు అడంగల్ నుంచి విస్తరణ నమోదు కొరకు పట్టాదారుని పాస్బుక్ రీప్లేస్మెంట్ కొరకు అర్జీలు స్వీకరించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతులుగా రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఏ శివకుమార్ మండల సర్వేయర్ ఎస్ కె రబియా పంచాయతీ కార్యదర్శి సునీత వి పవన్ కళ్యాణ్ వై దొరయ్య గ్రామ సర్పంచ్ వెలిచెర్ల నాగమణి రైతులు హాజరయ్యి తమ భూమి సమస్యలను తెలియజేశారు

## జాబ్‌మేళానందు 13మంది ఎంపిక

**కావలిరూరల్, డిసెంబర్6 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంప్లాయిమెంట్ ఆఫీసు సిడాప్ సంయుక్తంగా శుక్రవారం విక్రమసింహపురి యూనివర్సిటీ కావలి పి.జి సెంటర్‌నందు జాబ్‌మేళాను నిర్వహించడం జరిగింది. ఈ జాబ్‌మేళానందు గ్రీన్‌టెక్ పరిశ్రమలు, ముత్తూట్‌ఫైనాన్స్, బ్లూస్టార్ క్లైమోటెక్ లిమిటెడ్, ఎయిర్‌టెల్‌పేమెంట్ బ్యాంకుకంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో 40మంది సభ్యులు హాజరుకాగా 13మంది ఈ జాబ్‌లకు ఎంపికఅవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూమ్, విక్రమసింహపురి యూనివర్సిటీ కావలి పి.జి సెంటర్ ప్రిన్సిపాల్ ఎంపికైనవారిని అభినందనలు తెలియచేశారు.

## ఆర్థిక అవసరాలకు పొదుపు అవసరం




**నెల్లూరు క్రైమ్, డిసెంబరు 6, ప్రభాతవార్త :** తమ ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరు పొదుపు చేయడం అలవర్చుకోవాలని ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నవరాజ్ సూచించారు. స్థానిక వెంకటేశ్వరపురంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ క్రైమ్స్ పై అవగాహన సదస్సు ఆర్బిఐ సౌజన్యంతో ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత సైబర్ మోసాలపై అప్రమత్తత పై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమలో భాగంగా పలు రకాల బ్యాంకు పథకాలు, సేవల పై సంపూర్ణ అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన గోడపత్రికలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు షేక్.నౌరాజ్, కార్యదర్శి షేక్ అహ్మద్ సంస్థ రిసోర్స్ పర్సన్స్ కె.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ మాట్లాడుతూ పొదుపు అవసరం , సైబర్ నేరాలపై బ్యాంక్ ప్రతినిధులమంటూ అపరిచితుల నుంచి వచ్చే మేసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ వంటి నంబర్లు ఇతరులకు చెప్పవద్దన్నారు. అలాంటి గోప్యతా వివరాలను బ్యాంకులు అడగవని గుర్తించాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతా దారులకు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, సేవలను ఖాతాదారులకు వివరించారు. వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలను ఎలా తయారు చేసుకోవాలో వివరిం చారు. నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూ చించారు. ఫిర్యాదుల వ్యవస్థను ఉపయోగించుకొని సత్వర సక్రమ ఆర్థిక సేవల ను పొందాలన్నారు. బ్యాంకింగ్ అంబుడ్స్ మెన్ ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 54వ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ తాతా వెంకటేశ్వర్లు, బ్యాంకు ఖాతాదారులు, స్థానికులు పాల్గొన్నారు.

## జెమ్స్ మునీంద్రా రెడ్డికి జాతియ స్థాయి పురస్కారం



**రావూరు, డిసెంబరు6ప్రభాతవార్త**
విద్యారంగం నందు విశిష్ట సేవలు అందించినందుకు రాపూరులోని జెమ్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డికి జాతియ స్థాయి పురస్కారం పొందారు. హైదరాబాదులోని హైటెక్స్‌లో శుక్రవారం ఇటి టెక్స్ మరియు బ్రెయిన్ ఫీడ్ ఎడ్యుకేషనల్ సంయుక్తంగా నిర్వహించిన జాతియ స్థాయి విద్యా సదస్సులో విద్యారంగంలో మునీంద్రా రెడ్డి అందిస్తున్న సేవలకు ఈ పురస్కారం అందించారు. బ్రెయిన్‌ఫీడ్ సిఇఓ బ్రహ్మాన్ కాకాణి,తూర్పు రాయలసీమ యం.ఎల్.సీ యంవి రామచంద్రా రెడ్డి చేతుల మీదుగా ట్రయిల్‌బ్లాజర్ స్కూల్ ఆఫ్ దీ ఈయర్ 2024.2025 జాతియ పురస్కారాన్ని ఆందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా సబిఐ మాజీ జెడి లక్ష్మీ నారాయణ,టాలీవుడ్ నటులు ప్రదీప్,2018 మిస్ ఇండియా శ్రేయా యశ్వంత్,ప్రముఖ క్యాలిలగ్రఫి మల్లిఖార్జున తదితరులున్నారు. చిన్న వయస్సులోనేజాతియ స్థాయి పురస్కారం అందుకున్న జెమ్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డిని రాపూరుకు చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

## వేగూరు పంచాయతీకి పర్మినెంట్ కార్యదర్శిని నియమించండి



**కోవూరు, డిసెంబరు 6 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని వేగూరు గ్రామపంచా యతీలో ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్య దర్శి గత నాలుగు నెల లుగా డిప్యుటేషన్‌పై ఉండడంతో ప్రస్తుతం ఇన్‌చార్జి కార్యదర్శి వలన ఆశించిన మేర పనులు సాగడం లేదని, దీనిని దృష్టిలో పెట్టుకుని వేగూరు పంచాయతీకి పర్మినెంట్ కార్యదర్శిని నియమించాలని గ్రామ సర్పంచ్ కె. అమరావతి శుక్రవారం రెవెన్యూ సదస్సుకు హాజరైన జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇన్‌చార్జి కార్యదర్శి వలన తమకు పనులు ఆలస్యం అవుతున్నాయని, రెండు పంచాయతీలకు ఒకే కార్యదర్శి విధులు నిర్వహిస్తుండడం వలన రెండు పంచాయతీలకు ఆశించిన మేర న్యాయం చేయలేకపోతున్నారని, ఈవిషయాన్ని డీపీవో దృష్టికి తీసుకువచ్చారు.ఇందుకు ఆయన స్పందిస్తూ పర్మినెంట్ పంచా యతీ కార్యదర్శిని ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకుంటామనివారికి తెలి యజేశారు. టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బానాయుడు, కె. శ్రీనివాసులు ఉన్నారు.

## మెగా పేరెంట్స్-టీచర్ సమావేశానికి హాజరు కావాలి



**కోవూరు, డిసెంబరు 6 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామ నాథమ్మ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహిస్తున్న మెగా పేరెం ట్స్-టీచర్స్ స మా వేశానికి మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలంటూ పాఠశాల విద్యార్థులు ప్రత్యేకంగా రూ పొందించిన ఆహ్వాన పత్రాలతో శుక్రవారం వివిధ శాఖల అధికారులను కలిశా రు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, ఫిజికల్ డైరెక్టర్ దేవికలతో కలిసి విద్యార్థులు తాము రూపొందించిన ఆహ్వాన పత్రాలతో ఎంపీడీవో శ్రీహరిరెడ్డిని మండల విద్యాశాఖ అధికారులు రహీమ్, చెంచులక్ష్మమ్మ, కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ నాసర్‌లను కలిసి ఈ సమావేశానికి వచ్చి తమకు అమూల్యమైన సందేశాలు ఇచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## రెవెన్యూ సదస్సును సద్వినియోగం ప్రజలు చేసుకోవాలి



**లింగసముద్రం, డిసెంబర్ 6, ప్రభాతవార్త** ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎస్.సీతామహాలక్ష్మీ చెప్పారు. శుక్రవారం మండలంలోని మొగిలిచెర్ల పంచాయతీలోని నరసింహాపురంలో రెవెన్యూ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువురు రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం మొగిలిచెర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ పి.రమణయ్య, వీఆర్వో పి.అమానుల్లా ఖాన్, సర్వేయర్ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

## ఏ బ్యాంకైనా పథకాలు పొందవచ్చు



**నెల్లూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త-వైద్యం** ప్రభుత్వ పథకాలకు పోస్టాఫీసు అకౌంట్ అవసరం లేదని ఏ బ్యాంకు ఖాతా ద్వారా అయిన ప్రభు త్వం ప్రవేశపెట్టే పథకాలను పొందవచ్చని భారతీ య జనతా పార్టీ జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్ తెలియజేశారు. శుక్రవారం నగరంలోని రా మ్మూర్తి నగర్‌లో ఉన్న బీజేపీ జిల్లా కేంద్ర కార్యాల యంలో ప్రవీణ్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలు అవగాహన లోపంతో పోస్టాఫీసుల వద్ద భారీగా క్యూలైన్లో నిలబడి, కొత్త అకౌంట్ ఓపెన్ చేస్తేనే, ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు పడతాయని ప్రజలు అపోహలో ఉన్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ అన్నారు. ఏ బ్యాంకులోనైనా అకౌంట్ ఉండవచ్చని ఆధార్‌కి లింక్ చేసిన బ్యాంక్ అకౌంట్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు పడతాయని ఒక వేళ బ్యాంక్ అకౌంట్‌కి ఎన్పీసీఐ లింకు కానీ వాళ్ళు ఎన్‌పీసీఐ వెబ్‌సైట్లో లింక్ చేసుకోవచ్చని లేకపోతే బ్యాంక్‌కివెళ్లి ఎన్‌పీసీఐ లింక్‌చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచిం చాడు.

## వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

**నెల్లూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త-వైద్యం** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని పలు కాడర్లకు సంబంధించిన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకరరావు కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు శుక్రవారం ఏసీ నగర్‌లో ఉన్న బీసీ కేసీ కళ్యాణ మండపంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణకి వినతిపత్రం అందజేశారు. బదిలీలు, ప్రమోషన్లు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ తదితర అంశాలను వివరించారు. అలాగే 20 ఏళ్లు, 15 ఏళ్ళ లోపుగా వైద్యశాలలో పని చేస్తున్న 54 మంది హెల్త్ అసిస్టెంట్లు కోర్టు తీర్పుతో ఉద్యోగాలు కోల్పోతున్నారని వారికి మానవతా దృక్పథంతో ఉద్యోగాలు నిలిచే విధంగా ప్రభుత్వ పరంగా కృషి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి అందుకు సానుకూలంగా స్పందించారని చేజర్ల సుధాకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ఉద్యోగ సంఘాల నాయకులు, ఏపీ హంస సంఘ నాయకులు పాల్గొన్నారు.

## మదర్ థెరిసా అడుగుజాడల్లో ఎమ్మెల్యే



**విడవలూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** మండల కేంద్రంలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా మెగా జాబ్ మేళా కార్యక్రమం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షులు చెముకుల శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మదర్ థెరిసా అడుగు జాడల్లో నడవడం ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రజల కోసమే పలు సేవా కార్యక్రమాలను ప్రవేశ పెట్టడం జరుగుతుంది అని ఇలాంటి ఎమ్మెల్యే ప్రజలు ఎప్పుడు కూడా మర్చిపోరని మరలా జరిగే ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే అవ్వడం తథ్యం. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని కొనియాడారు. యువతీ యువకులకు శనివారం జరిగే జాబ్ మేళాలో నిరుద్యోగులకు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సారధ్యంలో ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు.

## యానాదులను రక్షించండి సార్ - గిరిజన సంఘ నేతలు



**విడవలూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** మండలం పటేల్ నగరం గ్రామానికి చెందిన చౌటూరు శ్రీనివాసులు కుటుంబ సభ్యులు పైన జరుగుతున్న దాడులు అరిక టాలని యానాది మహానాడు రాష్ట్ర అధ్యక్షురాలు సావిత్ర మ్మ సానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా నినాదాలు చేస్తూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యనమల దేవకు మార్ రెడ్డి తరచుగా చౌటూరు శ్రీనివాసులు కుటుంబ సభ్యులపై అసభ్య కరమైన ప్రవర్తన, కులం పేరుతో మాట్లాడి దాడులుచేయడం సరికాదన్నారు. ఒక గిరిజనుడు అభివృద్ధి పడుతుంటే ఓర్వలేక దేవకుమార్ రెడ్డి మరికొందరు గిరిజనులను చిన్న చూపు చూడడం అలాంటి వారి నుండి యానాదులకు రక్షణ కల్పించాలని పోలీస్ శాఖ ను ఆశ్రయించినట్లు తెలిపారు. ఇలానే గిరిజనులపై దాడులు పునర్వతం అయితే జరిగే పరిణామాలు మరోలా ఉంటాయని నినాదాలు చేస్తూ హెచ్చరించారు. అంతకుముందు స్థానిక ఎస్సైని కలిసి బాధి తుల కుటుంబానికి రక్షణ కల్పిం చాలని కోరమన్నారు. యా నాది మహానాడు మహిళా మండలి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ భాగ్యలక్ష్మి, కన్వీనర్ పురేటి మాణిక్యరావు, తిరువీధి మహేశ్వరి, పోనే టి ప్రమీల, చౌటూరు మురళి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో అంబేద్కర్ వర్ధంతి



**బిట్రగుంట, డిసెంబర్ 6,ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సంద ర్భంగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ రిపోంర్స్ యూనియన్(ఎపిఈఆర్ యు) జై భీమ్ అంబేద్కర్ సేవాదళ్ ఆధ్వర్యం లో బోగోలు లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో డోలా శ్రీహరి ప్రసాద్ ఎపిఈఆర్‌యు జిల్లా అధ్యక్షులు, ముల్ల రాజేంద్రప్రసాద్ రాష్ట్ర కార్యనిర్వక సభ్యుడు, బత్తుల రవిచంద్ర జై భీమ్ సేవాదళ్,అధ్యక్షులు అంబేద్కర్ విగ్రహాలకు పూలతో పూలమాలలతో నివాళులు అర్పించడం జరిగినది.అనంతరం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువు తున్న విద్యార్థిని శ్రీజా రాష్ట్రస్థాయిలో పెర్లింగ్ పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయిలో పాల్గొనుటకు తర్ఫీదు పొందుతున్న శ్రీజను అభినందించి జాతీయ స్థాయి పోటీలకు వెళ్ళుటకు ఆర్థికంగా సహాయం చేయడం జరిగింది.లేళ్లపల్లి వేణు,టీచర్ కృష్ణ ప్రసాద్,డా.బి ఆర్అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్,పిఈటి మరియు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది

## శ్రీ చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ట



విడవలూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త మండలం గా దెలదిన్నె గ్రామం హరిజన వాడలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శ్రీమాన్ పరంకుశం అనంతపద్మనాభ ప్రసాద్ ఆచార్యులు అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు. ఉదయం గణపతి పూజ, పూర్ణహృతి,మహా కుంభాభిషేకం, హోమాలు, తదుపరి కళ్యాణ కార్యక్రమం అంగరంగ వైభవంగా చేయడంతో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్లను చూసి తిలకించి పోయారు.ఆలయ సేవకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి టీటీడీ ద్వారా 10 లక్షలు ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి లక్ష , జడ్పీటీసీ సభ్యులు తుమ్మల లక్ష్మయ్య లక్ష రూపాయలు విరాళం అందించారు. ఆలయ నిర్మాణానికి సహాయపడిన వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్‌కు ఘన నివాళులు



**కందుకూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ సామాజిక వివక్షతకు వ్యతిరేకంగా ఉద్యమించి అణగారిన వర్గాల ఆర్థిక సామాజిక సాధికారిత కోసం తన జీవితం చివరి వరకు పోరాటం చేసిన యోధులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, చిలకాపటి మధుబాబు, ముచ్చు శ్రీనివాసరావు, షేక్ రఫీ, కూనం నరేంద్ర, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీనివాసరావు, నత్తా తిరుమలరావు, ముప్పవరపు వేణు, గుమ్మా శివ, సుదర్శి శ్యామ్, పాలేటి కోటేశ్వరరావు, గుల్ల సుధాకర్, కామినేని అశోక్, మంగపాటి వెంకటేశ్వర్లు, బద్దిపూడి, శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

## దార్శనికుడు అంబేద్కర్..




**కందుకూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** భారతరత్న, జాతీ యోద్యమ నాయకు డు, సామాజిక సమసమాజ స్థాపకుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా కందుకూరు వైఎస్సార్సీపీ కార్యాలయంలో జరిగినటువంటి వర్ధంతి కార్యక్రమంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రేణమాల అయ్యన్న అధ్యక్షత వహించి మాట్లాడారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకే భారత పౌరులైన ప్రతి ఒక్కరికి ప్రశ్నించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ కల్పించారని అన్నారు. ప్రముఖ అంబేద్కర్‌రిష్టన గేరా చిరంజీవి మాట్లాడుతూ అంబేద్కర్ స్వాతంత్ర్య ఉద్యమంలో అన్ని వర్గాలతో పాటు అణగారిన నిమ్న జాతుల ఆకాంక్షలను ప్రభావించే విధంగా నిలిచారని అన్నారు. వైసీపీ నాయకులు బిల్లా రమణయ్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సామాజిక సూత్రానికి అంబేద్కర్ ఆదర్శప్రాయమని కొనియాడారు. నాయిబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించి సమానత్వ సాధనకు పాటు పడ్డారని అన్నారు. వైసీపీ నాయకులు రావులకొల్లు బ్రహ్మానందం, మైనార్టీ నాయకులు షేక్ రిజ్వాన్, మహిళావిభాగం నాయకురాలు తలారి ప్రసన్న కుమారి, సీనియర్ న్యాయవాది ముప్పవరపు కిషోర్‌లు మాట్లాడారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గణేశం గంగిరెడ్డి, పాశం కొండయ్య, రేణమాల అయ్యన్న, రావులకొల్లు బ్రహ్మానందం, బిల్లా రమణయ్య, గేరా చిరంజీవి, వల్లూరి కోటేశ్వరరావు, పల్నాటి చెన్నయ్య, షేక్ రహీం, ఉచ్చులూరి రవీంద్ర, కూరపాటి వెంకటరామిరెడ్డి, జంగిలి ఇశ్రాయేలు, గల్లా వెంకటేశ్వర్లు, షేక్ రిజ్వాన, తలారి ప్రసన్న కుమారి, తన్నీరు ధరణి, షేక్ అబ్దుల్ కలాం, ఆలూరి సుందరరావు, నక్కా విజయ కుమార్, గొర్రెపాటి శ్రీనివాసరావు, శ్రీరామ కుమారస్వామి, కొచ్చర్ల మాల్యాద్రి, తాడికొండ వెంకటరావు, అప్పనబోయిన శివకృష్ణ, సీహెచ్ వెంకటేశ్వర్లు, వడ్డిముక్కల సురేష్, ద్రోణాదుల మణిబాబు, జంగిలి ప్రభుదేవా, చనమాల కోటేశ్వరరావు, శరత్, ప్రసన్న కుమార్, మాల్యాద్రి పాల్గొన్నారు.

## మోటారు బైకులు అపహరించే దొంగ అరెస్టు



**కందుకూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** మోటారు బైకులు దొంగిలించే వ్యక్తిని పట్టణ ఎస్సై వి.సాంబశివయ్య చాకచక్యంగా పట్టుకుని అరెస్టు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం అంకమ్మ గుడి సమీపాన మెడికల్ షాపు వద్ద ఉంచిన మోటారు సైకిల్ అపహరణకు గురైంది. పట్టణానికి చెందిన పాశం నవీన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి విచారణ చేసిన ఎస్సై సాంబయ్య సిబ్బందితో శుక్రవారం ఉదయం 10 గంటలకు పొన్నలూరు మండలం ముప్పాళ్ళ గ్రామానికి చెందిన గుంటక మాల్యాద్రి ను అతని ఇంటి దగ్గర అరెస్టు చేసి అతని వద్ద నుండి సదరు పాశం నవీన్‌కు సంబంధించిన మోటారు బైక్‌తో పాటు కందుకూరు, పొన్నలూరు, హైదరాబాద్, భీమవరం తదితర ప్రాంతాల్లో దొంగిలించిన మరో ఐదు బైకులను మొత్తం సుమారు రెండున్నర లక్షల రూపాయలు విలువ గల ఆరు మోటారు బైకులు అతని నుండి స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయి మాల్యాద్రిని రిమాండ్ నిమిత్తం కందుకూరు కోర్టు జడ్జి ముందు హాజరు పరిచినట్లు తెలియజేశారు.

## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి



**లింగసముద్రం, డిసెంబర్ 6, ప్రభాతవార్త** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎంపీడీఓ కట్ట శ్రీనివాసులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లింగసముద్రం సర్పంచ్ పులి రాఘవులు, మాజీ సర్పంచ్ ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పోలిమేర నాగిరెడ్డి, రాజారపు మాలకొండయ్య, గాలంకి ప్రసాద్, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామసభలో సమస్యలను పరిష్కరిస్తాం :తహశీల్దార్




కొడవలూరు విడవలూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త మండలం నాయుడుపాలెం గ్రామంలో రెవెన్యూ గ్రామ సదస్సులు కార్యక్రమం తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు భూ సమ స్యలు, రేషన్ కార్డులు, ఇతర సమస్యలు కూడా గ్రామ సభలో పరిశీలన చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ప్రజలకు తెలియజేశారు. అంతకు ముందు ప్రజల నుండి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ శాఖ జెడి సత్యవాణి, మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ ఐ సునీల్, వీఆర్వో సురేష్, నాయకులు మాగుంట సతీష్ రెడ్డి, గ్రామ రైతు లుతదితరులు పాల్గొన్నారు.

## సకాంలో వైద్యం అందక శిశువు మృతి

**బిట్రగుంట,డిసెంబర్ 6,ప్రభాతవార్త:** సకాలంలో నిండు గర్భిణీకి వైద్యం అందక శివు మృతి చెందిన సంఘటన విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామిపాలెం గిరిజన కాలనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది.గిరిజన కాలనీలోని పాముల నాగమణి అనే స్త్రీ కి పురిటి నొప్పులు రావడంతో కోవూరు పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తీసుకువెళ్లారు.అయితే ఆరోగ్య సిబ్బంది వెంటనే కావాలి ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లాలని సూచించడంతో గర్భిణీ స్త్రీ ని కుటుంబ సభ్యులు గిరిజన కాలనీకి తీసుకువచ్చారు.గర్భణీ స్త్రీ పరిస్థితి విషమించడంతో 108 వాహనం ద్వారా కావలి ఏరియా వైద్యశాలకు స్థానికులు తరలించారు.ఏరియా వైద్యశాలకు వెళ్లే లో గాని గర్భిణీ స్త్రీ కి నెలలు తక్కువ కావడంతో పుట్టిన శిశువు మృతి చెందింది.గర్భిణీ స్త్రీ కూడా తీవ్ర రక్తహీనతతో ఉన్నట్లు వైద్యులు గుర్తించి చికిత్స అందించారు.ఇకనైనా వైద్యాధికారులు స్పందించి గ్రామాల్లో నిరశ్రీరాశులయిన వారి విషయంలో గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమాలు విస్త ృతంగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్బంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు నివాళులు




**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 6,ప్రభాతవార్త:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు.శుక్రవారం నెల్లూరు నగంలోని ట్రంక్ రోడ్ నందు గల జిల్లా కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ పాశం నరసింహారావు కో-కన్వీనర్ పి లీలా మోహన్ మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఒక కులానికి,ఒక మతం సంబంధించిన వారు కాదని ఆయన అందరూ వారిని ఆ మహనీయుడు మూలంగానే ఇవాళ బడుగు బలహీన వర్గాలతో పాటు అణగారిన వర్గాలు కూడా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించి ఇవాళ దర్జాగా బతకడం జరుగుతుందని తెలియజేశారు.ప్రధానంగా అంటరానితనాన్ని నిర్మూలించడం ప్రతి ఒక్కరికి ఓటు హక్కును ప్రసాదించడం మహిళలకు ఆస్తిలో సమాన హక్కును కల్పించడం తదితర కీలకమైన అంశాలను రాజ్యాంగంలో చేర్చడం ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగిందని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను కొనసాగించడానికి ప్రజలు ఎల్లవేళలా ఉంటారని తెలిపారు. ఎస్ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా భవాని స్వామి సాంబ హైకోర్టు న్యాయవాది చింతకుంట శ్రీనివాసులు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు



**ఆత్మకూరు,డిసెంబర్6,ప్రభాతవార్త:** ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. వైద్యశాలలో అంబేద్కర్ చిత్రపటాదనికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల న్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆర్ ఎంఒ డాక్టర్ ఉషాసుందరి, హాస్పెటల్ వైద్యులు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లూరులో రెవెన్యూ సదస్సు

**అల్లూరు,డిసెంబర్ 6,ప్రభాతవార్త:**అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని అల్లూరుపేటలో శుక్రవారం తాసిల్దార్ లక్ష్మీనారాయణ మరియు అధికారుల సమక్షంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది,ఈ సందర్భంగా తాసిల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో ప్రధానంగా రెవెన్యూ సంబంధిత మరియు సర్వే సమస్యలు అనగా వన్ బి అడంగల్ లో పేర్లు మార్పులు నిషేధిత జాబితాలో తొలగింపులు నోషల్ ఖాతా సమస్యలు పొలం సరిహద్దు వివాదాలు వంటి సమస్యలకు రైతుల నుండి అర్జీలు స్వీకరించి సమస్య ఎప్పటిలోగా పరిష్కారం చేయగలమో రసీదు ఇవ్వడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మృదుల సర్వేర్ అశోక్ ఆర్ఐ ప్రభుదీప్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు



**బిట్రగుంట,డిసెంబర్ 6,ప్రభాతవార్త:** బోగోలు మండంలో శుక్రవారం బిట్రగుంట పంచాయతీలో రెవెన్యూ సదస్సులు ప్రారంభించినట్లు మండల తాసిల్దార్ మలిశెట్టి సురేష్ కుమార్ తెలిపారు.తొలి రోజు ప్రారంభమైన రెవెన్యూ సదస్సులో 9 అర్జీలు వచ్చాయని వాటిని అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 8 వరకు జరిగే రెవెన్యూ సదస్సులో ప్రజలు,రైతులు వారి వారి పంట పొలాలు,భూముల వివాదాలు,ఉంటే ఈ సదస్సులో పాల్గొని సమస్య అర్జీల రూపంలో ఇస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు.

## క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు అండగా నిర్మల్ కుమార్



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 6, ప్రభాతవార్త** అబైడింగ్ హోప్ ట్రస్ట్ ద్వారా 30 మంది క్యాన్సర్ బాధితులకు శక్తి ని పెంచే 15 రకాల తో కూడిన పౌష్టిక ఆహారం అందించారు. క్యాన్సర్ హాస్పిటల్ లో అబైడింగ్ హోప్ ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ యం టైటస్ నిర్మల్ కుమార్ క్యాన్సర్ రోగులకు పౌష్టిక ఆహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ తో కృంగిపోతున్న నిరు పేద రోగులకు ఈ రీతిగా సహాయం చేయడం సంతృప్తి గా వుందని చెప్పారు. ఏ జబ్బునైనా ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పారు.ప్రతి నెల నిరుపేద క్యాన్సర్ రోగులకు 12 నెలలు డాక్టర్స్ చెప్పిన న్యూట్రీషస్ ఫుడ్ ఐటమ్స్‌ని అబైడింగ్ హోప్ ట్రస్ట్ ద్వారా అందిస్థామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. లక్ష్మి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ,డాక్టర్. గీత చీఫ్ ఆంకాలజిస్ట్ మాట్లాడుతూ హాస్పిటల్‌లో అధునాతన పరికం ములతో ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతూ వున్నది. కాబట్టి రోగులు సమయానికి వచ్చి పరీక్షలు చేసుకోవాలని, దాతలు ఇచ్చే న్యూట్రీషస్ ఫుడ్ తీసుకోవడం చాలా ఆరోగ్యకరం, మంచిదని చెప్పారు. ఈ కార్యక్రమమునకు అసిస్టెంట్ కమీషనర్ ఉషా కిరణ్, జర్నలిస్ట్ ఏపీ జనరల్ సెక్రటరీ జయ ప్రకాష్, డాక్టర్. డేవిడ్ లివింగస్టన్ , కన్య కుమారి, క్యాన్సర్ హాస్పిటల్ కౌన్సిలర్ పాల్గొన్నారు.

## నేడు మెగాపేరెంట్ టీచర్స్ మీటింగ్

**పొదలకూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త :** పొదలకూరు మండలంలోని 103 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ఎంఇఓ పేర్కొన్నారు. అందువల్ల దీనికి సంబంధించి యాక్టివిటీస్ అన్నీ కూడా రేపు స్కూళ్లలో ఉన్న స్టూడెంట్స్ టీచర్స్, తల్లిదండ్రులు అందరూ కలిసి జరుపుకునే ఒక చదువుల పండగ. పొదలకూరు మండలంలోని జరుగుతున్న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ కు హాజరు కావలసినదిగా అందరినీ ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని పిలుపునిచ్చారు.

## రైల్వే అండర్ పాస్ నిలచిన నీరు, స్పందించిన కలెక్టర్



**కొడవలూరు (విడవలూరు), డిసెంబర్ 6, ప్రభాతవార్త** మండలం పాతోపు రైల్వే అండర్ పాస్ దగ్గర వర్షపు నీరు చేరి రెండు మండలాల ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు తువ్వార ప్రవీణ్ కుమార్ శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆనంద్ తో ఫోన్ లైన్ ద్వారా సమస్యను తెలియపరిచారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ కొడవలూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన సమస్యను నెల్లూరు రైల్వే జీఎం తో మాట్లాడి రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## మర్రిపాడులో 85అర్జీలు



మర్రిపాడు,డిసెంబర్6ప్రభాతవార్త: మండలంలోని డిసిపల్లి, నంద వరం లో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులకు 85అర్జీలు వచ్చాయని స్థానిక తహసిల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. డిసిపల్లిలో 39, నంద వరంలో 46 వచ్చాయని ఆయన తెలిపారు.ఈ అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది, ఆయా పంచాయతీల నాయకులు పాల్గొన్నారు.

## బుద్ధవిహార్‌నందు మాలల మహాగర్జన కరపత్రాలు ఆవిష్కరణ



**కావలిరూరల్, డిసెంబర్ 6 ప్రభాత వార్త** కావలిపట్టణం అంబేద్కర్ నగర్‌లోని బు ద్ధవిహార్‌నందు మాలల జెఏసి రాష్ట్ర అధ్యక్షులు దేవప్రసాద్, ఐఆర్‌యస్ (ఆర్) రాష్ట్ర అధ్యక్షులు టి.అశోక్ పిలుపుమేరకు యస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15వ తేదీ గుంటూరులో అఖిలభారత మాలలసంఘాల జెఏసి ఆధ్వర్యంలో హాలో మాల... చలో గుంటూరు అనే నినాదంతో మాలల మహాగర్జనకు లక్షలాదిమంది మాలలు తరలిరావాలని మాలల మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం కావలి నియోజకవర్గం ఆధ్వర్యంలో కమిటీలుగా ఏర్పడి ఉద్యమంలో అందరూ చురుకుగా పాల్గొని ఉద్యమాన్ని ముందుకు నడిపించడానికి తీసుకోవాల్సి న చర్యలగురించి మరియు ఈ నెల 15వతేదీ గుంటూరులో జరుగు మాలల మహాగర్జనను విజయవంతం చేయడానికి చర్చించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిలభారత మాలల సంఘాల జెఏసి నేతలు పాల్గొన్నారు.

## బుచ్చిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్



**బుచ్చి డిసెంబర్ 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని ఎస్ఎస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిదులుగా చైర్‌పర్సన్,రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామోహన్‌రావు,సాంకేతిక సభ్యులు అంజనికుమార్, ఇఇ రమేష్ చౌదరి పాల్గొన్నారు. ప్రజల వద్ద నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సమస్యలపై అర్జీలు ఇచ్చినవారికి నెలరోజులలో లోపు సమస్యను పరిష్కరించి రాత పూర్వకంగా వారికి తెలియజేస్తామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈకార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం ఏడి సతీష్,కోవూరు ఏడి మధుసూదన్‌రెడ్డి, ఇందుకూరుపేట ఏడి సురేంద్ర, సంగం ఏఇ మన్మధరావు, బుచ్చి టౌన్ ఏఇ మనోహార్, శ్రీనివాసులు, ఏఇ దొరసానమ్మ,జెఇశ్రీహరి పలువురు విద్యుత్‌వినియోగదారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సంగంలో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి



**సంగం డిసెంబర్ 6 ప్రభాత వార్త** మండలకేంద్రమైన సంగంలోని తహసిల్దారు కార్యాలయం ఆవరణలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. పంచాయితీ కార్యదర్శి నరసయ్య,దళితనాయకులు కృష్ణా మాట్లాడుతు తరతరాలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను గుర్తుపెటుకోవాలని కొనియాడారు. ఆయన చూపిన బాటలో మనమందరం నడవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సేవాట్రస్ట్‌ద్వారా పేదల ఆకలి తీర్చడం అభినందనీయం



**కావలిరూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త** ఆపద్బాంధవ సేవాట్రస్ట్‌ద్వారా పేదలకు ఆకలి తీర్చడం అభినందనీ యమని వివిధ స్వచ్ఛంద సంస్థల గౌర వాధ్యక్షులు షేక్.ఖాదర్‌బాషా తెలియచేశారు. ఆపద్బాంధవ సేవాట్రస్ట్ అధ్యక్షులు దామా మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటుచేసిన మధు వృద్ధాశ్రమంను స్వచ్ఛందసంస్థల నిర్వాహకులు శుక్రవారం సందర్శించి భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. షేక్.ఖాదర్‌బాషా మాట్లాడారు. ఆపద్బాంధవ సేవాట్రస్ట్ అధ్యక్షులు దామా మధుసూధన్‌రావు వారి సతీమణి రాజ్యలక్ష్మి దంపతులు మంచి సామాజిక సేవాతత్పరులని వారి సంస్థద్వారా పేదవారి ఆకలితీర్చాలని మంచి సంకల్పంతో ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తున్నారని తెలియచేశారు. కుటుంబాలలో ఎన్నోసమస్యలతో సరైన పోషణలేక ఇబ్బందులుపడుతున్నవారికి అన్నివసతులతో కూడి వృద్ధాశ్రమము ఏర్పాటుచేయడం అభినందనీయమని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రత్నమ్మ చారిటబుల్‌ట్రస్ట్ మధుసూధన్‌రావు, పియంపి ఓ.మస్తానయ్య, ఘంటసాల రామచంద్రయ్య, శారద, పియంపిలు పాల్గొన్నారు.

## పెరమన రెవిన్యూ సదస్సును పరిశీలించిన ఆర్‌డిఓ



**సంగం డిసెంబర్ 6 ప్రభాతవార్త** సంగం మండలం పెరమన గ్రామంలో రెవిన్యూ సదస్సు జరిగింది. తహసిల్దారు సోమ్లానాయక్ నేతృత్వంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఆత్మకూరు ఆర్‌డిఓ బి.పావని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతు ప్రజలు రెవిన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రత్యేకాధికారి రమేష్‌నాయక్ కూడా రెవిన్యూ సదస్సులో పాల్గొని ప్రజల వద్ద అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంగం ఆర్‌ఐ నారాయణ,విఆర్‌ఓ,రెవిన్యూ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



**ముత్తుకూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** మండలంలోని 20 పంచాయతీలో జరి గే గ్రామ రెవెన్యూ సదస్సు ను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహ సిల్దార్ ప్రదీప్ అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణపట్నం పంచాయతీలో రెవెన్యూ సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ప్రజల నుంచి 20 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకే ఈ సదస్సులను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నఅన్నారు. రీ సర్వే డిటి శ్రీనివాసులు, ఆర్‌ఐ వెంకటేష్, వీఆర్వో ఉమా, గ్రామస్తులు, రైతులు తది తరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



**ఆత్మకూరు,డిసెంబర్6,ప్రభా తవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సద స్సులను అందరూ సద్విని యోగం చేసుకోవాలని ఆర్‌డిఓ పావని పేర్కొన్నారు. మండలంలోని నబ్బీనగరంలో జరిగిన రెవెన్యూ సదస్సు కు ఆమె హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సేవలను ప్రజల ముంగిటకు చేర్చాలనే ఉద్దేశంతో ఈకార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిం చిందన్నారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ సుధీర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. పమిడిపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో 4అర్జీలు రాగా నబ్బీనగరంలో 13అర్జీలు వచ్చాయని తహసిల్దార్ సుధీర్ తెలిపారు.

## ఎంపిడిఒ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**వింజమూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త:** వింజమూరులోని ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. స్థానికమండల పరిషత్ సమావేశ మందిరంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, దళిత బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహానేత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ 1891లో జన్మించారన్నారు. ప్రముఖ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, సంఘసంస్కర్త , అంటరానితనం, కుల నిర్మూలనకు ఎంతో కృషి చేశారన్నారు. మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, ఎపిఒ మహబూబ్‌బాషా, కార్యాలయ సిబ్బంది సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ కళాశాల నందు అంబేద్కర్ 68వ వర్ధంతి



**ఉదయగిరి, డిసెంబర్ 6, ప్రభాతవార్త** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవి ద్యాలయం మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాల ఉదయగిరి నందు 6 డిసెంబర్ 2024 న డాక్టర్ భీమ్రావ్ రా మ్జి అంబేద్కర్ 68వ వర్ధంతి సంద ర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి అధ్యక్షత వహించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని మహాపరినిర్వాణ దివస్‌గా పేర్కొంటామని ఇది డిసెంబర్ నెలలో ముఖ్యమైన రోజులలో ఒకటి అని, భారత దేశ సామాజిక, రాజకీయ దృశ్యాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిందని దూరదృష్టిల గల గొప్ప నాయకుడి జీవితం, వారి సేవలను మనం స్మరించుకోవాలని అంబేద్కర్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమం ఎస్సీ, ఎస్టీ సెల్ అధికార డాక్టర్ కిషన్ తేజ ఆధ్వర్యంలో జరిగింది. డాక్టర్ రమేష్, డాక్టర్ శోభ, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ సునీత, అడ్మిన్నిస్టేటివ్ ఆఫీసర్ కమల ప్రియ, బోధనేతర సిబ్బంది జయరావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**వింజమూరు,డిసెంబర్6,ప్రభాత వార్త:** ప్రపంచమేధావి, రాజ్యాంగ రూపకర్త, మహనీయుడు డాక్టర్ బిఆర్‌అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగపట్ల వెంగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, గూడా నరసారెడ్డి, కోడూరు నాగిరెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ ,బిసి, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి, అబి వృద్ధికి రాజ్యాంగంలో అనేక హక్కులు కల్పించాడన్నారు. అలాంటి మహనీయు డి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కొండపల్లి వెంకటేశ్వర్లు, బూదాల లక్ష్మణ్, తిరుపతాచారి, బాదుల్లా, హజరత్‌రెడ్డి పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**ఉదయగిరి, డిసెంబర్ 6, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి లోని బీసీ కాలనీలో మట్ల రామయ్య లక్ష్మయ్య ఇద్దరు కలిసి పార్టీ సభ్యత్వం కార్డులు 100 రూపాయలు చెల్లించి ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని కోరారు. ఉదయగిరి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మన్నేటి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేయించుకోవాలని, గతంలో ఉన్న పాత కార్డులను కూడా రెన్యువల్ చేయించుకోవాలని బీసీ కాలనీ వాసులను ప్రోత్సహిస్తూ దగ్గరుండి ఇంటింటికి తిరిగి సభ్యత్వం మీద అవగాహన కలిగిస్తూ పార్టీ సభ్యత్వం కార్డులను చేపిస్తున్నటువంటి సోదరులు మట్లా రామలక్ష్మణులు బీసీ కాలనీ వాసులందరూ కూడా సభ్యత్వం చేయించుకోవడానికి ఉత్సాహంగా ముందుకు వస్తూ ప్రతి ఒక్కరూ సభ్యత్వం చేయించుకోవడానికి ఆసక్తిని చూపిస్తున్నారని అన్నారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్ పథకం



**ఉదయగిరి, డిసెంబర్ 6, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి ఏపీఎస్‌ఆర్టీసీ ఉదయగిరి డిపో వారు ప్రయాణికుల నుంచి ఆదరణ పొందేందుకు గిఫ్ట్ స్కీమ్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. దానిలో భాగంగా ఉదయగిరి డిపో ఆధ్వర్యంలో సీతారామపురం రూట్‌లో టికెట్ ద్వారా ఈ స్కీమ్‌లో పాల్గొనే అవకాశాన్ని కల్పించారు. ఇందులో భాగంగా బస్సులలో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్సులను డిపో మేనేజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెరిచి లక్కీ డ్రా తీయడం జరిగింది. మొదటి బహుమతి షేక్ ముజిబాకి రెండో బహుమతి జి.చెన్నమ్మకి లభించింది. ఈ మేరకు వారికి ఫోన్ ద్వారా సమాచారం అందజేసి వారికి డిపో మేనేజర్ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు సాధనకై అఖిల పక్ష సదస్సును జయప్రదం చేయండి



**ఉదయగిరి, డిసెంబర్ 6, ప్రభా తవార్త** వెలుగొండ ప్రాజెక్టు సా ధనకై, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కొరకు ఈనెల ఆది వారం 8వ తేదీ వైఎస్సార్ కడప జిల్లాలోని కడపపట్టణంలో జరిగే అఖిల పక్ష సదస్సు ను జయ ప్రదం చేయాలని దానికి సంబంధించిన కరపత్రాన్ని ఉదయగిరి నియోజవకర్గం దుత్తలూరు మండలం ఏరుకొల్లు గ్రామంలో వెలుగొండ సాధన సమితి నాయకులు కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ విషయంపై ఎనిమిదో తేదీ ఆదివారం కడపలో జరగబోయే అఖిల పక్ష సదస్సులో ప్రముఖులు మాజీ ఎంపీ తులసిరెడ్డి, రాయలసీమ సాగునీటి వనరుల పోరాట వేదిక నాయకులు కడప నారాయణరెడ్డి, రాష్ట్ర జనవిజ్ఞానవేదిక నాయకులు డాక్టర్ జి.సుధా కర్‌రెడ్డి, వెలుగొండ ప్రాజెక్టు సాధన ఐక్యవేదిక నాయకులు ఉదయగిరి జిల్లా అభివృద్ధి ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి అహ్మద్, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, స్వచ్ఛంద సంస్థల రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణయ్య, సామాజిక కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## కండలేరులో 54,898 టీయంసీల నిటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు),డిసెంబరు6 ప్రభా తవార్త** జలాశయంలో శుక్రవారం ఉదయా నికి54,808 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజ నీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల.కండలేరు వరద కాలువ ద్వారా 2100 క్యూసెక్కులు,వరదనీటి రూపేణా 1300 క్యూసెక్కుల చోప్పున మొత్తం 3400క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా జలాశయంలోకి వస్తుండగా అవుట ఫ్లోగా జలాశయం హెడ్ రెగ్యులేటర్ నుండి 1665 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 10క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 120 క్యూసెక్కులు చోప్పున మొత్తం 1795 క్యూసెక్కుల నీరుఅవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, డిసెంబరు 6 ప్రభాత వార్త :** గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ఆయా గ్రామాల్లోని రైతులు, ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం వేగూరు గ్రామ పంచాయతీలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నా వాటి పరిష్కారం కోసం ఈ సదస్సులను ఉపయోగించు కోవాలన్నారు. అదేవిధంగా ఇనామ్ భూములు, అసైన్డ్ భూములు, చుక్కల భూములు తదితర వాటికి సంబంధించి కూడా నిర్ణీత సమాచారంతో వినతిపత్రం ఇవ్వాలన్నారు. వీలైనంత వరకు తేలికపాటి సమస్యలు అయితే అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం నిర్వహించే ఈ సదస్సులను ఒక ప్రణాళికాబద్దంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా గ్రామాల రైతులు ఈ సదస్సులకు హాజరై వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏయే గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తున్నారో ముందురోజే రైతులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిర్మలానందబాబా ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమరావతి, ఆర్ఐ రాకేష్, సర్వేయర్ రమేష్‌గౌడ్, టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బానాయుడు , కరేటి శ్రీనివాసులు, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సలీమ్, తదితరులు ఉన్నారు.

## క్రీడా మైదానం చదునుకు శ్రీకారం



**కోవూరు, డిసెంబరు 6 ప్రభాత వార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వర్షం వస్తేఈ క్రీడా ప్రాంగణంలో నీరంతా నిలిచిపోయి.. నడిచి వెళ్లాలన్నా.. ఆటలు ఆడుకోవాలన్నా విద్యార్థులు తీవ్ర అవస్థలు పడేవారు. ఈ విషయమై ఇటీవల వార్తల్లో ప్రచు రితమైన కథనానికి కోవూరు ఎమ్మెల్యే స్పందించయారు. ఈ మేరకు ఈ ప్రాంతంలో క్రీడా ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో చదును చేసేలా సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, లేగుంటపాడు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డిలు ఆ ప్రాంగణానికి చేరుకుని జరుగుతున్న లెవలింగ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, ఫిజికల్ డైరెక్టర్ దేవిక, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

## ధీనజన బాంధవుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్



**కోవూరు, డిసెంబరు 6 ప్రభాత వార్త :** . రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ మహనీయుని 68వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో తరతరాలుగా అణచివేతకు గురవుతున్న వర్గాల హక్కుల కోసం తన జీవితాన్నే అంకితం చేసిన ధీనజన బాంధవుడు ఆయనే అన్నారు. అంబేద్కర్ కేవలం కొన్ని వర్గాలకో, కులాలకో చెందిన వాడిగా కొంత ప్రచారం జరుగుతుందని, నిజానికి అంబేద్కర్ అందరివాడే అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు స్వేచ్ఛ వచ్చి అంబేద్కర్ రాజ్యాంగం అమలువుతుందన్నారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేసి చూపించిన పార్టీ తెలుగుదేశం పార్టీయే అని , దివంగత ఎన్టీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులు ఆయన ఆశయాలను అమలు చేసి చూపించారన్నారు. టీడీపీ నేతలు విజయ్, రామారావు, సత్యనారాయణరెడ్డి, మురళీకృష్ణారెడ్డి,రంగారెడ్డి, నరసింహ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు,ఉన్నారు.

## కళా ఉత్సవ పోటీలలో బేబిఆర్ ప్రధమస్దానం



**కోవూరు డిసెంబర్ 6 ప్రభా తవార్త** కోవూరు నియోజకర్గ పరిధిలోని పల్లిపాడు డైట్ కళా శాలలో శుక్రవారం జరిగిన కళా ఉత్సవ్ ఉమ్మడి జిల్లా స్దాయి పోటీలలో కోవూరు జెబిఆర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్దులు ప్రధమస్దానం కైవశం చేసుకున్నారు. ఈ పాఠశాల విద్యార్దినులు ప్రదర్శించిన కోలాట బృందం నృత్యానికి ప్రధమస్దానం లబించింది. ఈమేరకు డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ చేతుల మీదుగా ప్రధమబహుమతిని విద్యార్దులు పొందారు. తమ పాఠశాల విద్యార్దులు ఉమ్మడి జిల్లా స్దాయిలో ప్రధమ బహుమతి సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి .శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా స్దాయిలో తమ పాఠశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింప చేసిన విద్యార్దులను ప్రత్యేక అభినందించారు.

## ఘనంగా డాక్టర్ అంబేదర్కర్ 69వ వర్దింతి కార్యక్రమం



**నెల్లూరు,డిసెంబరు6 ప్రభాతవార్త-విద్య** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిర్ అంబేద్కర్ 69వ వర్దంతి కార్యక్రమాన్ని శుక్రవారం నగరంలోని స్దానిక డికే జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంల ముఖ్య అతిధిగా కళాశాల ప్రిన్సిపాల్,ఇంటర్ బోర్డు ప్రాంతీయపర్యవేక్షణ అధికారి డాక్టర్ ఆదూరుశ్రీనివాసులు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భాతర జాతి గర్వించదగిన నాయకులు అంబేద్కర్ అని కోనియాడారు. సామాజిక,కుల వివక్షత, అంటరానితనం వంటి వాటి నిర్మూలకు ఆయన యనలేని సేవలు చేవారన్నారు. ప్రపంచం గర్వించదగిని రాజ్యాంగాన్ని దేశానికి అందించిన ఘనుడని కీర్తించారు. యువత ఆయన ఆశయ సాధనకోసం పాటుపడాలన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది కొండయ్య, శ్రీదేవి, చంద్రకళ, కృష్ణతులసి, శివయ్య, శ్రీధర్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణ,భద్రతా చట్టాలపై అవగాహన



**కండలేరుడ్యాం(రాపూరు),డిసెంబరు6ప్రభాతవార్త** మండలంలోని కండలేరు డ్యాంలో వున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు శుక్రవారం మహిళ రక్షణ,భద్రతా చట్టాలపై అవగాహనాకార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హెనా సుజనా ఆదేశాలతో గురుకులం ప్రిన్స్‌పాల్ భారతీ ఆధ్యక్షతన,రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సునంద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్ధినీలకు సఖీ కేస్ వర్కర్ శారద చెల్డ్ మ్యారేజ్ గురించి హెల్ప్ లైన్ నెం.100 112 181 10 98 182 గురించి, చిన్న పిల్లల మీద లైంగిక వేదింపులు,గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ట్రాఫికింగ్ గురించి, ఇటువంటి ఆపదల గురించి ఎలా తప్పించుకోవాలో సెల్ఫ్ డిఫెన్స్ గురించి అవగాహనా కల్పించారు. బాలలు, మహిళలపై జరిగే లైంగిక వేధింపులు జరిగినప్పుడు సైలెన్స్‌గా వుండకుండా ముందుగా ఎవరికి చెప్పాలి అన్నా విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మేడికల్ లీలావతి, సఖి సిబ్బంది, కళాశాల ఉపాధ్యాయులు,విద్యార్ధినీలు పాల్గొన్నారు.

## దేశానికి అంబేద్కర్ చేసినసేవలు చిరస్మరణీయం



**కావలి, డిసెంబర్6 ప్రభా తవార్త** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఈ దేశా నికి చేసిన సేవలు చిరస్మరణీ యమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి ఎమ్మెల్యే కార్యాలయంలో అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాలలువేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు.కావలి పట్టణ ట్రంకు రోడ్డులోని ఏరియా వైద్యశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నేతలతో ఎమ్మెల్యే భారీగా తరలివెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంపై, ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి కావలిపట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, టిడిపి నేతలు, అంబేద్కర్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంబేద్కర్ జిందాబాద్ అన్న నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది.

## దళితులు, మహిళలు, కార్మికులకోసం పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ బిజెపి నేతలు



**కావలి, డిసెంబర్6 ప్రభా తవార్త** దళితుల, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహాయోధుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని బిజె పి నేతలు కొనియాడారు. బిజెపి కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో కావలి ట్రంకు రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాలలువేసి నివాళులర్పిం చారు. బిజెపి కావలి పట్టణశాఖ ప్రధానకార్యదర్శి మందా కిరణ్‌కుమార్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి కావలి అసెంబ్లీ కన్వీనర్ సివిసి సత్యం, ప్రముఖ వస్త్రవ్యాపారనేత బిజెపినేత అమరా వెంకటసుబ్బారావు, నాయకులు పరుసు వెంకటేశ్వర్లు, కూరాకుల సవీంద్ర, కోదూరు మురళీకృష్ణ, గుడిపల్లి ప్రసన్నకుమార్, మందా శ్రీనివాసులు, కటకం మనోజ్‌కుమార్, తూమాటి తిరుపతిస్వామి, ముంగమూరు వెంకటరెడ్డి, పంది వెంకటసాయిమేఘనాథ్, మేదరమెట్ల మణిదీప్, దేవళ్ల రాకేష్, నెల్లూరు సుభాష్, చెరుకుమల్లి కృష్ణ, మట్ట మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ గొప్పతనాన్ని కొనియాడారు.

## ఉలవపాడులో అగ్నిగుండ ప్రవేశం



**ఉలవపాడు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** ఉలవపాడులో శ్రీ సకల జనుల కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి ఆలయం ఎదుట అగ్నిగుండం ప్రవేశం గురు భవాని గునిమిని శ్రీనివా సులురెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. అగ్ని ప్రవేశం చేసిన స్వాములు అమ్మవారి కృపను పొందారు. సాయంత్రం పాత రైల్వే రోడ్డులోని వినాయక స్వామి మందిరం నుంచి కలశ జ్యోతులు ఊరేగింపు మంగళవాయిద్యాలతో కలశ జ్యోతుల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి విశేష అలంకారం, చండీ హోమం, ఆలయ ప్రదక్షిణలు, తర్పణాబిషేకం, బిక్ష కార్యక్రమం జరిగాయి. అనంతరం నిప్పుల గుండం ప్రవేశం జరిగింది. ఆలయ ధర్మకర్త వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, గోమినేని చెంచురామనాయుడు, తన్నీరు సుబ్బారావు, గురు స్వామి, మైపాడు కళ్యాణ్, గురుస్వామి, పల్లపు సుబ్బులు, భవాని గురు స్వామి, నెల్లూరు శ్రీను, భవానీ గురు స్వామి, మద్రి జైఆంధ్ర గురుస్వామి(శ్రీరాములు), అయ్యప్ప స్వాములు, భవాని స్వాములు, శివ స్వాములు, గోవింద స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు



**ఉలవపాడు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** మండలంలోని బద్దిపూడి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 15 అర్జీలు వచ్చాయని మండల తహశీల్దార్ వి.లావణ్య శుక్రవారం తెలిపారు. అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## జమ్మలపాలెం అరుంధతీయవాడలో మద్యం విక్రయాలపై దాడులు

**కావలి, డిసెంబర్ 6 ప్రభాతవార్త** కావలి సమీపంలోని జలదంకి మండలం జమ్మలపాలెం గ్రామంలో అరుంధతీయవాడలో చట్టవిరుద్ధంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నవారిపై కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి దేవిక, పోలీసు సిబ్బంది శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. శెట్టిపల్లి బాలకుమార్‌వద్ద ఉన్న 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు.

## చెన్నారాయనిపాలెంలో వివాహిత ఆత్మహత్య



**బిట్రగుంట,డిసెంబర్ 6,ప్రభాతవార్త:** బోగోలు మండలం చెన్నరాయన పాలెం లో శుక్రవారం వాల్మీకిశివ గౌరి(26) ఫ్యాన్ కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్ప డింది.మృతురాలి తల్లి సుజాత ఎర్యాదు మేరకు బిట్రగుంట ఇన్చార్జ్ ఎస్సై జంపాల కుమార్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు మృతురాలి భర్త నవీన్ సున్నబట్టి వద్ద ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు.ఆత్మహత్యకు కారణాలు పోలీసుల దర్యాప్తుతో తేలాల్సి ఉంది.

## నూతన సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి



**కోవూరు, డిసెంబరు 6 ప్రభాతవార్త :** . సమాజంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులపై ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీరాణి తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల అటల్ టింకరింగ్ ల్యాబ్ శుక్రవారం టెక్కీబాట్ సాంకేతిక సహకారంతో విద్యార్థులకు నతన సాంకేతిక పరిజ్ఞానంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కీ బాట్ శిక్షకుడు టి. కార్తీక్ మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక రంగంలో ఆర్టిఫిషియల్ టెక్నాలజీ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి నూతన సాంకేతిక ప్రయోగాలు వచ్చాయని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు. వీటిపై కూడా పాఠశాల విద్యార్థులు అవగాహన చేసుకోవాలన్నారు. ప్రస్తుతం దేశంలో డ్రోన్ల వినియోగంలో కూఆ అన్ని రంగాల్లో విస్తరించిందని, ప్రభుత్వం కూడా డ్రోన్ల వినియోగాన్ని ఇటీవల పలు విషయాల్లో పరిశీలించిందన్నారు. దీని పట్ల కూడా విద్యార్థులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు భారతి, ఫిజికల్ డైరెక్టర్ దేవిక, తదితరులు ఉన్నారు.

## యనమదల ఆర్‌ఒ ప్లాంట్ నిర్వహణ కార్యదర్శికి అప్పగింత



**చేజర్ల డిసెంబర్ 6 ప్రభాతవార్త** చేజర్ల మండలం యనమదల గ్రామ పంచాయితీ పరిధిలోని ఆర్‌ఒ ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు గ్రామ పంచాయితీ కార్యదర్శికి అప్పగిస్తు జిల్లా పంచాయితీ అధికారి ఎల్.శ్రీదర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినంలో గ్రామస్తుల నుండి అందిన ఫిర్యాదు మేరకు యనమదల గ్రామ సర్పంచ్ నోటి సుందరయ్యపై ఆత్మకూరు డిఎల్‌పిఒ క్షేత్రస్థాయిలో విచారించి జిల్లా అధికారులకు నివేదిక సమర్పించడంతో జిల్లా అధికారులు ఈమేరకు చర్యలు చేపట్టారు. ఆర్‌ఒ ప్లాంట్ నిర్వహణలో అవినీతి ఆరోపణలు పలు విమర్శలు రావడంతో అవన్నీ విచారణలో వాస్తవాలని తేలడంతో సర్పంచ్ నోటి సుందరయ్య చెక్ పవర్ రద్దు చేస్తు ఇటీవల జిల్లా పంచాయితీ అధికారి ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే అయినప్పటికి ఆర్‌ఒ ప్లాంట్‌ను సర్పంచ్ తన కబంద హస్తాల్లో ఉంచుకొని లోపభూయిష్టంగా ఇష్టారాజ్యంగా ఇప్పటికి నిర్వహించడంతో స్పందించిన జిల్లా అధికారులు పంచాయితీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులన్నీ పంచాయితీ కార్యదర్శి సంరక్షణలోనే ఉంచుకొని నిర్వహించాలని తాజా ఆదేశాలతో పేర్కునడంతో కొసమెరుపు. ఉత్తర్వులు ఇలా .... జరిగేది మరోలా... ఆరోఒ ప్లాంట్ నిర్వహిణ పంచాయితీ కార్యదర్శికి అప్పగిస్తు ఉత్తర్వులు జారీ అయినా వాటర్ ప్లాంట్ దగ్గర సర్పంచ్ నోటు సుందరయ్య బందువులే ఉండడం గమనార్హం

ఈవిషయంలో ఏం మతలబు జరిగిందో... ఆ పంచాయితీ కార్యదర్శికే ఎరుక....ఇంత జరిగినా....తిరిగి మరలా దొంగల చేతికే తాళాలు ఇచ్చినట్లుయిందని పలువురు గుసగుసలు లావదుతున్నారు. జిల్లా అధికారులు ఒక్కసారి దీనిపైన దృష్టి పెట్టండి సారూ.... ఇదిలా ఉంటే టెండర్ లేకుండా ఒక వ్యకిని నియమించడం నిబంధనలకు విరుద్ధం. నిబంధనలు ఉల్లఘించి ఇష్టారాజ్యంగా వ్యవహారించిన కార్యదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై పూర్తి విచారణ నివేదిక ఆత్మకూరు డిఎల్‌పిఒ జిల్లా అధికారులకు అందజేయాల్సి ఉంది. ఇందుకు సంబందించి ఇంకా విచారణ జరుగుతోంది. ఈనేపద్యంలో కార్యదర్శి నిబంధనలకు విరుద్దంగా వ్యవహారించడం పట్ల సర్వత్రా చర్చి జరుగుతోంది. పంచాయితీ కార్యదర్శి వివరణ కోరగా ఈవిషయమై యనమదల పంచాయితీ కార్యదర్శి నాయబ్ రసూల్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా నోటి విష్ణు అనే వ్యక్తిని ఆర్‌ఒ ప్లాంట్ వద్ద నియమించినట్లు పేర్కున్నారు. నిబంధనలకు విరుద్దంగా నియమించడం సరికాదు కాదా అన్ని ప్రశ్నించగా జవాబు దాట వేశారు.

## తెలుగుదేశంపార్టీ ప్రభుత్వంలో ప్రతిఒక్కరికి పరిష్కారం



**కావలిరూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త** తెలుగుదేశంపార్టీ ప్రభుత్వంలో ప్రతిఒక్కరికి పరిష్కారం జరుగుతుందని ప్రజలు రెవిన్యూ సదస్సును సద్వినియోగంచేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలియచేశారు. కావలి రూరల్ మండల రుద్రకోట గ్రామంలో రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామరెవిన్యూ సదస్సు కార్యక్రమం కావలి తహశీల్దారు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భారతరాజ్యాంగనిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెవిన్యూసమస్యలకు సంబంధించి తహశీల్దారు శ్రావణ్‌కుమార్‌కు దరఖాస్తు చేసుకుంటే సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలియచేశారు. రుద్రకోటగ్రామం నాకు రాజకీయంగా గుర్తింపుతెచ్చిన గ్రామమని, ఈ రైతుసదస్సుకు తప్పనిసరిగా హాజరు కావడం జరిగిందని తెలియచేశారు. గతంలో రుద్రకోట గ్రామానికి వచ్చినపుడు కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా ఈ గ్రామప్రజలు ఆదరించడం జరిగిందని చెప్పినప్రకారం రుద్రకోట గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నానని తెలియచేశారు. ఈ గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలియచేశారు. గతంలో ఈ గ్రామానికి వచ్చినపుడు ప్రజలు భయభ్రాంతుల మధ్య ఉన్నారని ఇళ్లలోనుంచి బయటకు రావడానికికూడా భయపడేవారని తెలియచేశారు. వీటిని లెక్కచేయకుండా గత ఎన్నికల్లో కలిసికట్టుగా ఉండి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ధన్యవాదాలు తెలియచేశారు. రాష్ట్రంబాగుండాలని, రాష్ట్రభవిష్యత్తు బాగుండాలని, రాష్ట్రప్రజలు బాగుండాలనుకునే ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని తెలియచేశారు. రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధిచేయాలనే ముందుచూపుఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని తెలియచేశారు. రెవిన్యూ సమస్యలు గత పాలకుల దౌర్జన్యాలు, దోపిడీల వలన రెవిన్యూసమస్యలు ఎక్కువయ్యాయని వాటి పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయని,అందరూ ఈ రెవిన్యూసదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. ఆర్డీఓ వంశీకృష్ణ ప్రత్యేక అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించడం జరిగింది. స్పషల్ ఆఫీసర్ మ ల్లారెడ్డి, కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు, రెవిన్యూ అధికారులు ,సచివాలయసిబ్బంది,తెలుగుదేశంపార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేద్కర్



**నెల్లూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త-వైద్యం** అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు పాటు పడి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని పట్టణ, పురపాలక శాఖాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ కొనియాడారు. శుక్రవారం నగరంలోని ఏసీ నగర్‌లో ఉన్న బీసీ కళ్యాణ మండపంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి మంత్రి నారాయణ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అణగారిన వర్గాల గొంతుకను వినిపించిన మహోన్నత వ్యక్తి, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అమోఘమన్నాడు. అంబేద్కర్ పోరాటమంతా బహుజనుల రాజ్యాధికారం దిశగానే సాగిందన్నారు. అణగారిన వర్గాల గొంతుకను వినిపించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని, ఆయన ఆశయాల సాధన కోసం సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని వెల్లడించారు. గత ప్రభుత్వాలు అంబేద్కర్ ఆశయాలపై నీళ్ళు చల్లాయని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ పోరాటపటిమను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అంబేద్కర్‌కు నివాళులర్పించిన అనంతరం జరిగిన రెవెన్యూ సదస్సులో మంత్రితోపాటు కలెక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌డియఫ్‌సి బ్యాంకు సిబ్బంది రక్తదానం




**కావలి, డిసెంబర్6 ప్రభాతవార్త** కావలి హెచ్‌డియఫ్‌సి బ్యాంకులో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ బెజవాడ రవి కుమార్ శుక్రవారం ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతదేశంలో విద్యార్థులను మినహాయిస్తే రక్తదానం చేయడంలో బ్యాంకులు, యల్‌ఐసి ఉద్యోగులు అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఎ.లక్ష్మినారాయణ, పి.ప్రసన్న కుమార్, యస్‌కె.అమన్‌జి, యం.దిలీప్, జె.మనోహర్, సిహెచ్ ఫణికుమార్, జె.సాయికుమార్, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## స్కానింగ్ కేంద్రాలలో తనిఖీలు



**నెల్లూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రితో పాటు పలు ఆసుపత్రిలలో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లను శుక్రవారం వైద్యశాఖాధికారులు అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్ వలి, జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం, పలువురు డీఎల్‌ఏసీ మెంబర్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కిమ్స్ ఆసుపత్రి, ఐశ్వర్య ఫెర్టిలిటీ ఆసుపత్రి, అమృత వెస్ట్ ఆసుపత్రిలో ఈ తనిఖీలు చేశారు. రికార్డులు, నివేదికలు, ఫారమ్-ఎఫ్లమ్ పరిశీలించారు. జిల్లా అదనపు డీఎం హెచ్‌ఓ డాక్టర్ ఖాదర్ వలి మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేసినట్లు తేలితే అలాంటి సెంటర్లను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తమ ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. అలాగే స్కాన్ చేయించుకున్న ప్రతి గర్భిణీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలా నమోదు చేయని సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలలో ఓఎస్వేవ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కుసుమకుమారి, క్షయ విభాగం జిల్లా కోఆర్డినేటర్ విజయకుమార్‌లు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ని స్మరించుకోవడం మనందరి బాధ్యత



**కావలి, డిసెంబర్ 6 ప్రభాతవార్త** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి వైసిపి కార్యాలయంలో శుక్రవారం అంబేద్కర్ జయంతి వేదుకలను ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికోసం ఆయన ఎంతగానో పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయాలకు అణుగుణంగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డిలు నడుచుకున్నారన్నారు. వైసిపి నేతలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య దిగ్గజం స్వర్గీయ గ్రంధి యానాదిశెట్టి



**కావలి, డిసెంబర్6 ప్రభాతవార్త** స్వర్గీయ కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్, మాజీ ఏఎంసి ఛైర్మన్ గ్రంధి యానాదిశెట్టి ఆర్యవైశ్య దిగ్గజంగా పేరుప్రఖ్యాతులు గడించారని కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్ ప్రముఖ సర్జన్ డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు కొనియాడారు. శుక్రవారం కావలి పట్టణంలోని గ్రంధి నివాసంలో గ్రంధి మొదటి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలవేసి నివాళులర్పించారు. రాజకీయాల్లో గ్రంధి ప్రత్యేకతను చాటిచెప్పి అందరిమన్నలను పొందారన్నారు. కావలి పట్టణానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. గ్రంధి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు, ఓటములు సర్వసాధారణం



**కావలి, డిసెంబర్ 6 ప్రభాతవార్త** క్రీడల్లో గెలుపు, ఓట ములు సర్వసాధారణమని కావలి ఆర్డీఓ యం.వంశీకృష్ణ క్రీడాకారులకు ఉద్బోధించారు. కావలి జవహర్‌భారతి క్రీడా మైదానంలో విక్రమసింహపురి విశ్వవిద్యాలయస్థాయిలో అంతర్ కళాశాలల గేమ్స్ టోర్నమెంట్స్ కావలి ఆర్డీఓ వంశీకృష్ణ శుక్రవారం ప్రారంభించి జెండావందనాన్ని స్వీకరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మాట్లాడారు. క్రీడల్లో ఓడిపోయినపుడు దాని తాలూ కు ఆనవాళ్ల నుండి ఎంతత్వరగా బయటపడి మరలా విజయంవైపుకు ప్రయాణం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యంనాయుడు, కరస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రసాదరెడ్డి, యూనివర్సిటి స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ సిహెచ్ వెంకట్రాయలు, యూనివర్సిటి అథ్లెటిక్‌మీట్ పరిశీలకులు డాక్టర్ ఏ.ప్రవీణ్‌కుమార్, మాజీ ఫిజికల్ డైరెక్టర్ వై.కోటేశ్వరమ్మ, మాజీ ప్రిన్సిపాల్ కె.రాజగోపాల్‌రెడ్డి, రిటైర్డ్ హిందీ అధ్యాపకులు భాస్కరరావు, క్రీడా సహాయకులు మణికంఠ, తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలోని 15 కళాశాలలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పోలంరెడ్డి



**కోవూరు, డిసెంబరు 6 ప్రభాతవార్త** : కోవూరు గ్రామ పంచాయతీ 1వ వార్డు సభ్యులు , పార్టీ సీనియర్ నాయకులు పి. వెంకటేశ్వర్లు కుమారుడికి ఇటీవల వివాహం జరిగింది. ఈ మేరకు శుక్రవారం నూతన వధూవరులను ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కోవూరులోని వారి నివాసానికి వచ్చి వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుతో పలు విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కృష్ణచైతన్య, బాల రవి, ముసలి సుధాకర్, నాటకరాణి వెంకట్, దారా విజయ్‌బాబు, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, సాధిక్, పెంచలయ్య, చౌదరి, తదితరులు ఉన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను అభినందించిన పోలంరెడ్డి



**నెల్లూరు అర్బన్,డిసెంబర్ 3, ప్రభాతవార్త** రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెం ట్ కార్పొరేషన్ ఛైర్మ న్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను ప్రత్యేకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛంతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ ద్వారా పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు కృష్ణచైతన్య, విజయ్‌బాబు, ఎం. సుధాకర్, తదితరులు ఉన్నారు.

## జిల్లా ఎస్పిని సత్కరించిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



**కోవూరు డిసెంబర్ 6 ప్రభాతవార్త** రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొ రేషన్ ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి శుక్రవారం జిల్లా ఎస్పి కృష్ణకాంత్‌ను ఆయన కార్యలయంలో కలిశారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి జిల్లాఎస్పికి పూల బొక్కేను అందజేసి సత్కరించారు. ప లు విషయాలపై చర్చించారు.

# రేషన్ బియ్యం విక్రయాలకు అడ్డాగా మారిన కావలి..!

### రెండురోజుల్లో నాలుగు లారీల రేషన్ బియ్యం పట్టివేత..!! 20లక్షల రూపాయల పైచిలుకు విలువ కలిగిన బియ్యం స్వాధీనం..!!!





**కావలి, డిసెంబర్ 6 ప్రభాతవార్త** రేషన్ బియ్యం తరలింపుపై ఉక్కుపాదం మోపాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఆదేశాలు కావలిలో అధికారులు బేఖాతరు చేయడంతో నల్లబజారుకు లారీలకు, లారీలు యథేచ్ఛగా రేషన్‌బియ్యం తరలిపోతున్నాయి. వివిధ శాఖల అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో రేషన్‌బియ్యం ప్రహసనానికి కావలి అడ్డాగా మారింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నల్లబజారుకు తరలివెళుతున్న దాదాపు 600ల రేషన్‌బియ్యం బస్తాలు, 3 లారీలలో యథేచ్ఛగా పట్టపగలు తరలించడంతో సమాచారం అందుకున్న కావలి ఒన్‌టౌన్ పోలీసులు ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ మూడు లారీలను కావలి తహశీల్దారు కార్యాలయానికి తరలించారు. గురు, శుక్రవారాల్లో రెండురోజులు నాలుగు లారీల రేషన్‌బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రేషన్ బియ్యం కావలి ప్రాంతంలోని పలు రైసుమిల్లుల ద్వారా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎవరైనా వెంబడించి సమాచారమిస్తే తప్ప అధికారులు రేషన్ బియ్యం తరలింపును అడ్డుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండురోజుల్లో పట్టుబడ్డ రేషన్ బియ్యం బస్తాలు ఏ మిల్లునుంచి బయటకు వస్తున్నాయి, ఆ మిల్లులకు ఎక్కడినుంచి ఈ బస్తాలు వస్తున్నాయి అన్న సమాచారం అధికారులదగ్గర ఉన్నప్పటికి గోప్యంగా ఉంచడంపట్ల అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. గతంలో వైసిపిపాలనలో జోరుగా రేషన్ బియ్యం విక్రయాలు యథేచ్ఛగా సాగడంతో వారంతా కోటీశ్వరులయ్యారన్న ప్రచారం ఆనాడు ఉంది. తెలుగుదేశం పాలనలో కూడా ఈ రేషన్‌బియ్యంలోడు లారీలు పట్టపగలు నల్లబజారుకు తరలివెళ్లడంతో పెద్ద చర్చనీయాంశమైంది. రైసుమిల్లులవద్ద రేషన్‌బియ్యం లారీలు పట్టుకుని, మరెక్కడో పట్టుకున్నట్లు అధికారులు చెప్పడంపట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధితశాఖల అధికారులకు భారీగా ముడుపులు చేరడంతో వాస్తవాలు చెప్పడంలో అధికారులు దోబూచులాట ఆడుతున్నారన్న ప్రచారంకూడా లేకపోలేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఆదేశాలు పాటిస్తూ, కావలి ప్రాంతంలో రేషన్‌బియ్యం అక్రమార్కుల భరతంపడుతూ పేదప్రజలకు అందాల్సిన రేషన్‌బియ్యాన్ని సజావుగా అందించాలని కావలిప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రైసుమిల్లులపై తరచుగా విజిలెన్స్ తదితరశాఖల అధికారులు తనిఖీలు నిర్వహించి రేషన్‌బియ్యం తరలింపుకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం జరిగిన దాడుల్లో కావలి ఒన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఫిరోజ్, ఎస్ఐ సుమన్‌లు ఈ మూడు లారీలను పట్టుకున్నారు. గురు, శుక్రవారాల్లో పట్టుకున్న నాలుగు లారీల రేషన్ బియ్యం బస్తాల విలువ దాదాపు 20లక్షల రూపాయల పైచిలుకు ఉంటుందని అధికారుల అంచనా.

## అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేద్దాం -మేయర్ పి.స్రవంతి



**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 6,ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహేబ్ అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి తెలిపారు.అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జాతీయ నాయకులలో అంబేద్కర్ మహోన్నతమైన వ్యక్తిగా నిలిచి పేద,బడుగు బలహీనులకు రాజ్యాంగ పరంగా అనేకచట్టాల రూపకల్పనతో వారి అభ్యున్నతికి కృషి చేశారని వివరించారు.భారతదేశంలో బడుగు మలహీనవర్గాల ఆనాటి దుస్థితిని గమనించిన అంబేద్కర్ వారి అభ్యున్నతికి రాజ్యాంగంలో ఎన్నో ప్రత్యేక హక్కులను కల్పించారన్నారు.కులమతాలకు అతీతంగా అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లే భారతదేశం నేటికి ఐక్యంగా నిలబడగలిగిందన్నారు. అదనపు కమిషనర్ నంద న్,నగరపాలక సంస్థ మేనేజర్ఇనాయతుల్లా,అన్ని విభాగాల ఉన్నతాధికారులుసిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ ఆంబేదర్కర్‌కు ఘనంగా నివాళి



**నెల్లూరు,డిసెంబరు6 ప్రభాతవార్త-విద్య** భాతర రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా జనసేన పార్టీ ఆధ్వ ర్యంలో శుక్రవారం నగరంలోని స్థానిక విఆ సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోర్ కమిటీ సభ్యులు గునుకుల కిషోర్ మాట్లాడుతు బడుగు బలహీన వర్గాల అభ్యునతి కోసం, సమాజంలో అంటరానితనాన్ని పోగొట్టడం కోసం అంబేద్కర్ చేసిన కృషి భావి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రపంచం గర్వించే విధంగా దేశ రాజ్యాంగాన్ని రూపొందించిన మహాను బావుడని కొనియాడారు. నేడు మనం అనుభవిస్తున్న సేచ్ఛా వాయువులు, సమానత్వం, అన్నీ ఆయన రాజ్యాంగం ద్వారా ప్రతీ పౌరునికి ఇచ్చిన వరమన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమని తెలిపారు. అంబేద్కర్ ఆశయసాధనలో సాగుతున్న తమ పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పేదలఅభ్యునతికి పాటుపడుతున్నారన్నారు.ఆయన బాట లోనే నడుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో ఆ పార్టీ నాయకులు కారంపూడి కృష్ణారెడ్డి, సుందరరామిరెడ్డి, ప్రశాం త్‌గౌడ్, కార్యాలయ ఇన్‌చార్జ్ జమీర్, హేమంత్, సుమన్, సందీప్ పాల్గొన్నారు.

## కోనలో గిరిజన కళ్యాణ మండపానికి స్థలం కేటాయించాలి



**రాపూరు, డిసెంబరు6ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచల కోనలో గిరిజనులు వివాహాలు చేసుకునేందుకు కళ్యాణమండపం కోసం స్థలం కేటా యించాలని గిరిజన నాయకులు పోట్లూరి శ్రీనివాసుల రావు,వెతగిరి సుధాకర్ రావు, వెతగిరి మోహన్‌రావు,చచ్చాల ప్రసాద్ శరవణ తదితరులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూపెంచలకోనలో అన్ని కుల సంఘాలకు అన్నదాన,కళ్యాణ సత్రాలు వున్నాయన్నారు. అయితే గిరిజనుల ఇంటి అల్లుడైన గిరిజన కులానికి మాత్రం సత్రం లేదన్నారు.దీనిపై తాము వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణను కలసి గిరిజన సత్రానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం సమర్పించడంజరిగిందన్నారు. వెంటనే ఎండోమెంట్ అధికారులు స్పందించి గిరిజన కళ్యాణమండపానికి స్థలం కేటాయించాలని వారు కోరారు.

## జనసేనలో చేరిన 50 గిరిజన కుటుంబాలు



**నెల్లూరు,డిసెంబరు6 ప్రభాతవార్త-విద్య** శుక్రవారం నెల్లూరు నగరానికి చెందిన విశ్రాంత రైల్వేఉద్యోగి దాసరి పోలయ్య ఆధ్వర్యంలో 50 గిరిజన కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. నగరంలోని స్థానిక గోమతి నగర్‌లోని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యాయంలో జరిగిన ఈ చేరికల్లో పార్టీ కోర్ కమిటీ సభ్యులు నూనెమల్లిఖార్జున యాదవ్ గిరిజనులకు పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందన్నారు. అలాగే తమ పార్టీ అధినేతపవన్ కళ్యాణ్ ఆశయలకు ఆకర్షితులై యువత తమ పార్టీలో చేయటం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందరరామిరెడ్డి, గునుకుల కిషోర్, జమీర్, అనుదీప్, పవన్ యాదవ్, హరిరెడ్డి, మురళీ, నాగరత్నం, నందిని, రవికుమార్, కృష్ణారెడ్డి, హసీన, తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డుల సేవలు అభినందనీయం : జిల్లా ఎస్పీ



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 6, ప్రభాతవార్త:** 62 వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నగరంలో ఘనంగా నిర్వహించారు. 62 వ హోం గార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భముగా ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆ జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ పోలీసు వాయిద్యాల మధ్య గౌరవ వందనం స్వీకరించి, హోం గార్డ్స్ అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ పోలీసు శాఖకు వెన్నెముక వలే నిలచి విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తున్నదని అన్నారు. పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న వారి సేవలు ప్రశంసనీయమని, శాంతి భద్రతల పరిరక్షణ, నేరనియంత్రణ, తుఫాన్ విపత్తు సమయంలో హోంగార్డుల సహకారం, ప్రజలకు చేసిన సేవలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. హోంగార్డుల సంక్షేమంలో భాగంగా వారికి శాఖాపరమైన సదుపాయాలు, ప్రభుత్వ పథకాలు అమలు పరుస్తున్నామని తెలిపారు. నీతి, నిజాయితీ, అంకితభావంతో పనిచేస్తూ హోంగార్డ్ వ్యవస్థకు, పోలీస్ శాఖకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పోలీసులతో సమానంగా డ్రైవర్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణ, కంప్యూటర్ ఆపరేటింగ్... ఇలా చాలా రకాల విధుల్లో హోంగార్డుల పాత్ర కీలకమని, జిల్లాలో మొత్తం మహిళలతో కలిపి 701 మంది హోం గార్డులు ప్రధాన విభాగాలలో విధులు నిర్వహిస్తున్నారని, వరదలు, రొట్టెల పండుగ, బ్రహ్మోత్సవాలు, ప్రముఖుల బందోబస్త్ లను ఎంతో క్రమశిక్షణతో నిర్వహించి, జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. హోం గార్డుల సమస్యలన్నింటినీ సమగ్రంగా విని, సాధ్యాసాధ్యాలను బట్టి త్వరితగతిన పరిష్కారం చూపుతామని ఎస్పీ హామీనిచ్చారు. అతి తక్కువ కాలంలో కంపెన్సేషన్ అపాయింట్ మెంట్స్ 3 నెలల వ్యవధిలో ఇచ్చినందుకు, అడిగిన వెంటనే పోలీస్ క్యాంటీన్, ఈవెంట్స్ ప్రాక్టీస్ కు అవకాశాలు కల్పించి, పోలీస్ శాఖ చేపట్టిన అన్ని సంక్షేమ కార్యక్రమాలలో పోలీసులతో సమానంగా తమకు కల్పించి సమున్నత స్థానం ఇస్తున్న యస్.పి.కి హోంగార్డ్స్. ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఈ ఏడాది పలు విభాగాలలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 29 మంది హోంగార్డులకు ప్రశంసా పత్రాలను అందించి ఎస్పీ అభినందించారు. తదుపరి ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నుండి కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. తదుపరి స్వయంగా రుచికరమైన భోజనాలు ఎస్పీ స్వయంగా వడ్డించారు. అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య, అడిషనల్ యస్.పి.(ఏఆర్) జి. మునిరాజ, డిఎస్పిలు శ్రీనివాస రావు , శ్రీనివాస రెడ్డి, జి. శ్రీనివాసరావు, గిరిధర్ రావు, హోంగార్డ్స్ ఆర్ఐ పాల్ రాజ్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పోలీసు అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీ శాఖ మంత్రి ని కలిసిన ఉద్యోగసంఘాల నేతలు



**బిట్రగుంట,డిసెంబర్ 6,ప్రభాతవార్త:** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను శుక్రవారం ఎపిఆర్‌ఎస్‌సిఎస్‌టిఈఎస్ఎ తరపున కలిసి పలు ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల మీద చర్చిండం జరిగింది.1.పిఆర్‌సి,డిఎ సరెండర్ లీవ్ తదిత అంశాల గురించి వివరించగా,త్వరలో పిఆర్‌సి కమిటీ ఛైర్మన్ నియామకం జరుగుతుందని,ఉద్యోగ ఉపాధ్యాయులు పడిన కష్టాన్ని గుర్తించామని,రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్ లో వున్నప్పటికీ జనవరి నుంచి దశల వారీగా అన్ని బకాయిలు చెల్లిస్తామని తొలిపారు.2 పలు జిల్లాల్లో విఆర్ఎ నుంచి విఆర్వో పదోన్నతులు కల్పించడం లేదని తెలుపగా తగు ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు.3.విఆర్వో అండ్ విఎస్ ల జీతభత్యాలు తహసీల్దార్ వారి ద్వారా ఇవ్వకపోవడం వల్ల వారు పలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పగా ఈ విషయం పై చర్చించి విఆర్వో అండ్ విఎస్ ల జీతాల పూర్తిగా రెవెన్యూ శాఖ పరిధిలో వుంచే లాగా ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చారు.4 తాసిల్దార్ కార్యాలయాలు శిధిలావస్థలో వున్నాయని గ్రామ సచివాలయం భవనాలు మండల కేంద్రాలలో వున్న వాటిలో ఒక అంతస్తును మంజూరు చేయాలన కోరగా,ప్రస్తుత పరిస్తితులలో రాష్ట్ర ఖజనాకు ఆర్థిక భారం లేని సూచనలు చేసినందుకు మెచ్చుకుంటూ అతి త్వరలో ఉత్తర్వులు ఇస్తామని తెలిపినారు.5.ఎసిబి తదితర క్రమశిక్షణా చర్యలు కొన్ని సంవత్సరాలుగా విచారణ కొనసాగుతున్నందున వారి కుటుంబాలు పడుతున్న వేదనను గమనించి త్వరితగతిన పూర్తి చేసేలాగా అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపినారు.6.ఆంధ్ర ప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రానికి 1800 మంది,అక్కడ నుంచి ఇక్కడకు 1300 మంది అంతర్రాష్ట్ర బదిలీకోసం దాశాలు చేసుకున్నారని,కావున వారి సమస్యను పరిష్కరించమని కోరగా రాష్ట్ర విభజన కమిటీ దృష్టికి వెంటనే తీసుకు వెళ్లి న్యాయం జెరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. .రీ సర్వే డిటి ల జీతాలు సుమారు 3 నెలల నుంచి రావడం లేదని దాని వల్ల రీ సర్వే డిటి లు పలు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయగా ఈ విషయం తన దృష్టిలో వున్నదని కొద్ది రోజులలో వారి జీతాలకు సంబంధించిన ఉత్తర్వులు వస్తాయని తెలిపారు.ఇవే కాకుండా పలు ఇతర రవెన్యూ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల చాలా సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు సిహెచ్.చిట్టిబాబు గారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరీష్ మొలతాటి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీ చైతన్య గారు తదితరులు పాల్గొన్నారు.

## సరదాగా ఈతకి వెళ్లి బాలుడు మృతి



**విడవలూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త** మండలంలో పెన్నా నదిలో తోటి స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటన ముదివర్తి గ్రామం హరిజనవాడలో చోటుచేసుకుంది. వివరాలు దక్క నోయల్‌గ్రేస్ (15)నది గుంతలో పడిపోవడంతో వైద్యం కోసం హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొం దుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరేష్ తెలిపారు.